TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 54 మంగళవారం 29-09-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## అర్ధాంతరంగా నిలిచిన కాళేశ్వరం ఎత్తిపోతలు



**ధర్మారం, సెప్టెంబర్ 28 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2 అనుబంధ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేర్) జలాశయానికి గోదావరి జలాల ఎత్తిపోతలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ నెల 4వ తేదీ నుంచి 12 వరకు, ఆ తర్వాత 15వ తేదీ నుంచి 28వరకు ఎత్తిపోతలు చేపట్టారు.కాగా, నీటి పారుదల శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం 4:30 గంటలకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్లను నిలిపి వేసినట్టు ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. తదుపరి ఆదేశాలు వస్తే మళ్లీ జలాల ఎత్తిపోతలు చేపడుతామని వారు పేర్కొన్నారు.

## యూపీఐ చార్జీలపై వివరణ ఇవ్వండి

- కేంద్రాన్ని కోరిన సుప్రీం కోర్టు
- స్టే ఇచ్చేందుకు నిరాకరణ
- ఛార్జీలకు చట్టబద్ధత ఏంటని ప్రశ్నించిన సుప్రీం
- ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా నోటీసులు జారీ
- నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



02

## రకూల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు

- రకూల్‌తో పాటు మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు
- ఫిల్మ్ ప్రాజెక్టుల నిధుల మళ్లింపుపై ఆరా
- విదేశీ లావాదేవీలను పరిశీలిస్తున్న ఐటీ అధికారులు
- డాక్యుమెంట్లు, ఆర్థిక రికార్డుల తనిఖీ
- నిర్మాత వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్ ప్రాంగణాల్లోనూ సోదాలు



02



## తెలంగాణలో కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- తెలంగాణలో కొత్త బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ జారీ
- దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజుగా నిర్ణయం
- అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ, 16న లాటరీ ద్వారా కేటాయింపు
- కొత్త బార్ల ద్వారా ప్రభుత్వానికి రూ.14.62 కోట్ల వార్షిక ఆదాయం అంచనా
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 14, ఇతర మున్సిపాలిటీల్లో 27 బార్ల ఏర్పాటు అంచనా

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

తెలంగాణలో కొత్తగా 41 బార్ అండ్ రెస్టారెంట్లు (2బి) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరితో కూడిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయుఆర్) పరిధిలో 14, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27 బార్లకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నేటి నుంచి అక్టోబర్ 12 వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దరఖాస్తులు స్వీకరిస్తారు.

-మిగతా 2 లో

# తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు

### టీడీపీ బలహీనపడటంతో ప్రజల సూచన మేరకు కాంగ్రెస్‌లో చేరా



- నాణ్యమైన విద్యే తెలంగాణ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- విద్య వల్లే అంబేడ్కర్ రాజ్యాంగం రచించారు
- అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా
- 2014 తర్వాత తెలంగాణలో కేసీఆర్ వర్సెస్ రేవంత్
- ఇది ప్రజలందరికీ అందుకే వివరిస్తున్నాం
- సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా పోటీ మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తనను అనేకసార్లు జైలుకు పంపిందని, అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లానని చెప్పారు. ఢిల్లీలో జరిగిన 'ది కాంక్లేవ్ 2026'లో పాల్గొన్న ఆయన.. తెలంగాణ రాజకీయాలు, విద్య, తన రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్‌లో చేరిక తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.**

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి

తెలంగాణ అసెంబ్లీకి వెళ్లిన దాని కంటే తాను ఎక్కువగా జైలుకే వెళ్లానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపారని పేర్కొన్నారు. 2014 తర్వాత తెలంగాణలో కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారిందని ఆయన చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై మాట్లాడిన ఆయన..

-మిగతా 2 లో



02

## టోల్ బూత్‌లకు గుడ్‌బై.. ఇక నాన్‌స్టాప్ జర్నీ!

- టోల్ ప్లాజాల వద్ద ఇక పడిగాపులు అవసరం లేదు
- మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానానికి శ్రీకారం
- వాహనాలు ఆగకుండానే టోల్ వసూళ్లు
- ఫాస్టాగ్‌తోపాటు నంబర్ ప్లేట్ స్కానింగ్
- ఆర్ఎఫ్ఐడీ, కెమెరాలు, సెన్సర్లతో ఆటోమేటిక్ టోల్
- ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకున్నా నంబర్ ప్లేట్‌తో గుర్తింపు
- తెలంగాణలో 11 టోల్ ప్లాజాలకు కొత్త విధానం
- టెండర్ల ప్రక్రియలో ఎన్‌హెచ్ఏఐ, ఐహెచ్ఎంసీఎల్
- మరో ఐదారు నెలల్లో అమల్లోకి వచ్చే అవకాశం
- గుజరాత్‌లో ప్రయోగం.. ఇతర రాష్ట్రాలకు విస్తరణ

## చలాన్లు కట్టకపోతే కరెంట్ బిల్లుతో కలపండి!

- పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై సుప్రీంకోర్టు ఆందోళన
- రూ.20 వేల కోట్లకు పైగా ఈ-చలాన్ల బకాయిలు
- చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులకు జతచేయడంపై సూచన
- చలాన్లు వసూలుకు ఇతర మార్గాలు అన్వేషించాలని ఆదేశం
- ఆర్‌సీ పునరుద్ధరణ నిలిపివేతను పరిశీలించాలని సూచన
- వాహనాల యాజమాన్య బదిలీని అడ్డుకునే అంశంపై చర్చ
- పెండింగ్ చలాన్ల వాహనాలను పరివాహన్‌లో బ్లాక్‌లిస్ట్ చేసే యోచన
- డ్రైవింగ్ లైసెన్స్, పీయూసీ పునరుద్ధరణపైనా ఆంక్షల ప్రతిపాదన
- చెల్లించని చలాన్ల వాహనాల తనిఖీలకు సూచన
- విద్యుత్ బిల్లుతో కలపడం ఆదేశం కాదు.. కేవలం సూచనే



02



## స్థానిక ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కేడర్‌కు దిశానిర్దేశం
- పార్టీ ముఖ్య నేతలతో కల్వకుంట్ల కవిత వరుస సమావేశాలు
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బలంగా పోటీ చేయాలని సూచన
- పాంచజన్య సంకల్ప సభలపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్న కవిత
- ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు తక్షణమే స్పందించాలని పిలుపు
- రిమ్స్ ఘటనపై పార్టీ పోరాటంతోనే ప్రభుత్వం స్పందించిందన్న కవిత
- ఉమ్మడి జిల్లాల వారీగా బుధవారం వరకు కొనసాగనున్న సమావేశాలు
- మెడికల్ సీట్ల స్థానికతపై జీవోలు 33, 150 రద్దు చేయాలని డిమాండ్

హైదరాబాద్,

రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటేలా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నేతలతో సమావేశమైన కవిత.. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు

-మిగతా 2 లో



02

## ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత

- ఇరాన్ శాంతి ప్రణాళికను ట్రంప్ తిరస్కరణ
- అమెరికాతో యుద్ధానికైనా సిద్ధమన్న ఇరాన్
- అంతిమ యుద్ధం వచ్చినా ఎదుర్కొంటామన్న అరాగ్చీ
- చర్చలకు తాము సిద్ధమేనని ఇరాన్ స్పష్టీకరణ
- హర్మూజ్ జలసంధి తెరవాలంటే షరతులు నెరవేర్చాలి
- ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు తిరస్కరణ
- స్తంభించిన దౌత్య చర్చలకు మళ్లీ అవకాశం
- ఫ్రీజ్ చేసిన ఆస్తులు విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్
- చమురు విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేయాలని విజ్ఞప్తి
- అమెరికా డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్న ఇరాన్

# పట్టభద్రులు మన వైపే

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే

- హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ స్థానంపై కేటీఆర్ ధీమా
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ
- పట్టభద్రుల ఓటరు నమోదుపై నేతలు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకునేలా చూడాలి
- యువత, నిరుద్యోగులు, విద్యావంతులు ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారన్న కేటీఆర్
- బీజేపీకి యువత దూరమవుతోందని కేటీఆర్ వ్యాఖ్య
- నేతలంతా సమన్వయంతో పనిచేసి గెలుపు కోసం కృషి చేయాలి
- పట్టభద్రుల ఓటరు జాబితాలో కేటీఆర్ పేరు నమోదు



హైదరాబాద్,

హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని కేటీఆర్ సూచించారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీకి అనుకూల వాతావరణం ఉందని ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున

-మిగతా 2 లో

# రకూల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు

-రకూల్‌తో పాటు మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు
-ఫిల్మ్ ప్రాజెక్టుల నిధుల మళ్లింపుపై ఆరా
-విదేశీ లావాదేవీలను పరిశీలిస్తున్న ఐటీ అధికారులు
-డాక్యుమెంట్లు, ఆర్థిక రికార్డుల తనిఖీ
-నిర్మాత వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్ ప్రాంగణాల్లోనూ సోదాలు



ముంబై

బాలీవుడ్ నటి రకూల్ ప్రీత్ సింగ్ తో పాటు ఆమె మామ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్‌తో పాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఇవాళ ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. నిధుల తరలింపులో అక్రమాలు చోటుచేసుకున్న కోణంలో ముంబై ఇన్‌కం ట్యాక్స్ శాఖ ఈ సోదాలు చేపడుతున్నది. ఫిల్మ్ ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో విదేశాలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముంబై ఐటీశాఖకు చెందిన పలు బృందాలు.. ఇవాళ ఈ కేసులో డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రికార్డులను పరిశీలిస్తున్నాయి.ఓవర్‌సీస్ లావాదేవీల గురించి కూడా ఐటీశాఖ ఆరా తీస్తున్నది. గత ఏడాది డిసెంబర్‌లో రకూల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ కోసం ఓ డ్రగ్ కేసులో పోలీసులు గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. 2025, డిసెంబర్ 19వ తేదీన డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పోలీసులు ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 43 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏను సీజ్ చేశారు. అయితే ఈ కేసులో ఆ ఇద్దరు పెడ్లర్ల నుంచి అమన్ అయిదు సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయి.

# తెలంగాణలో కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్

(మొదటి తరువాయి)

అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విజేతలను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు లైసెన్స్ తీసుకోకపోతే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్ లో స్పష్టం చేశారు. ప్రాంతాన్ని బట్టి వార్షిక బార్ ఎక్సైజ్ ట్యాక్స్ ను (బీఈటీ) నిర్ణయించారు. టీసీయుఆర్ పరిధిలోని బార్లకు రూ.44 లక్షలు, బోధన్ వంటి కొన్ని ప్రాంతాలకు రూ.42 లక్షలు, మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.30 లక్షలుగా రుసుము ఖరారు చేశారు. ఈ 41 కొత్త బార్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.14.62 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ నోటిఫికేషన్ ద్వారా దేవరకద్ర, ఎల్లంపల్లి, మద్దూరు, గుమ్మిడిదల వంటి ప్రాంతాల్లో తొలిసారిగా బార్లు ఏర్పాటువుతున్నాయి. వీటితో పాటు చేవెళ్ల, మొయినాబాద్, కొడంగల్, పరిగి, అశ్వారావుపేట, కల్లూరు, మక్తల్, నర్సంపేట, స్టేషన్ ఘన్ పూర్, ములుగు వంటి పలు మున్సిపాలిటీల్లోనూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా సుమారు 1,185 బార్లు ఉండగా, ఒక్క హైదరాబాద్ లోనే 657 బార్లు ఉన్నాయి.

# తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు

(మొదటి తరువాయి)

తెలంగాణ రాజకీయాలు, విద్య, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, డీలిమిటేషన్, ఎన్నికల ప్రక్రియల గురించి చర్చించారు. అలాగే తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంపైనా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు ప్రస్తుతం నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాల్సిన అవసరం ఉంది. చదువు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి చేరుకున్నారు. చదువుకోవడం వల్లే మన్మోహన్ సింగ్ ప్రధాని స్థాయికి, అబ్దుల్ కలాం రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించడమే మా మొదటి ప్రాధాన్యం. అందుకే ప్రైవేటుకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను, ఆ తర్వాత స్కిల్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం అని తెలిపారు.

తెలంగాణలో విద్యార్థి సంఘాల ప్రభావం తక్కువ. రాష్ట్రంలో లెఫ్ట్, రైట్ విద్యార్థి సంఘాలు మాత్రమే ఉన్నాయి. ఎస్ఎఫ్ఐయూఐ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తరాది, దక్షిణాదిలో రాజకీయాల శైలి భిన్నం. ఏబీవీపీలో గెలిచిన విద్యార్థి నేతలు ఆ తర్వాత కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ యూనివర్సిటీ, గ్రామ రాజకీయాలు వేర్వేరు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుంది. 2006లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జెడ్పీటీసీగా గెలిచా. 2007లో స్వతంత్ర ఎమ్మెల్యేగా విజయం సాధించా. రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించా. అప్పట్లో తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ రెండు పార్టీలే ఉండేవి. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని టీడీపీలో చేరా. టీడీపీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా. 2017లో కాంగ్రెస్‌లో చేరా. 2019లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించా. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ ప్రాధాన్యం తగ్గింది. ఏపీలో టీడీపీ నాయకత్వం ఉండటంతో తెలంగాణలో పార్టీ బలహీనపడింది. ప్రజల సూచనతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీని తొలిసారి కలిసినప్పుడు 15 నిమిషాలు మాట్లాడా. ఆ రోజే రాహుల్ గాంధీని నాయకుడిగా నిర్ణయించుకున్నా.

ఆయనకు వ్యక్తిగత ఎజెండాలు లేవు..

దేశమే ముఖ్యం. 2014 తర్వాత తెలంగాణలో పోటీ కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారింది అని స్పష్టం చేశారు. కేసీఆర్ నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా. అప్పట్లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రం, ఏపీలో ఎన్డీయేతో పోరాడాల్సిన పరిస్థితి. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేష్ నా శ్రేయోభిలాషులు. విద్యార్థి సంఘం, టీడీపీ, కాంగ్రెస్ నేను ఎక్కడ ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో కొనసాగుతున్నా' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# యూపీఐ చార్జీలపై వివరణ ఇవ్వండి

-కేంద్రాన్ని కోరిన సుప్రీం కోర్టు
- స్టే ఇచ్చేందుకు నిరాకరణ
- ఛార్జీలకు చట్టబద్ధత ఏంటని ప్రశ్నించిన సుప్రీం
- ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా నోటీసులు జారీ
- నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ

యూపీఐపై ఎండీఆర్ ఛార్జీలు విధించడాన్ని సమర్థిస్తూ వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఈ ఛార్జీలు విధించడానికి ఉన్న కారణాలను వివరిస్తూ నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. కేంద్రంతో పాటు ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న ఎండీఆర్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.

యూపీఐ ద్వారా వ్యాపారులకు వ్యక్తులు చేసే 2 వేలకు పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీలు విధించనున్నారు. ఇది అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తుంది. వ్యక్తుల నుంచి వ్యక్తులకు జరిగే లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ఇవి ఉచితంగానే కొనసాగుతాయి. 2 వేల రూపాయలకు పైబడిన నిర్దిష్ట యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉన్న చట్టపరమైన, విధానపరమైన ఆధారాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీం సోమవారం నాడు కోరింది. యూపీఐ ఛార్జీలపై న్యాయవాది అంజన్ దత్తా దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయసూర్య బాగ్చి, వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలు విధించేలా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సెప్టెంబర్ 14, 5వ తేదీల్లో జారీ చేసిన నోటిఫికేషన్లను పిటిషనర్ సవాల్ చేశారు. అధికారికంగా చేసిన నోటిఫికేషన్ ప్రకారం వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే 2 వేల రూపాయలకు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను, 75 వేలకు పైబడిన లావాదేవీలపై గరిష్ఠంగా 300 రూపాయలు ఎండీఆర్ విధిస్తారు.

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్. వెంకటరామన్ హాజరయ్యారు. ఈ ఛార్జీలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తాయని, 96 శాతం లావాదేవీలు ఛార్జీల పరిధిలోకి రావని ఆయన కోర్టుకు వివరించారు. నిత్యవసర సేవలకు ఎండీఆర్‌ను 5 రూపాయలకు పరిమితం చేసినట్లు కోర్టుకు తెలిపారు. ఇది పన్నా, లేక రుసుమా ఒక వేళ రుసుము కాకపోతే, ఈ స్వచ్ఛందానికి కార్యాచరణక ఆధారం ఏంటని న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. కోర్టుకు ఈ వాస్తవాలు అఫిడవిట్‌లో కావాలని, ఇది ఎక్కువగా సాంకేతిక సమస్యగా ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.

ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చి ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 269ఎస్‌యును ప్రస్తావించారు. ఈ సెక్షన్ ప్రకారం నిర్దిష్ట టర్నోవర్ ప్రమాణాలను చేరుకున్న కొన్ని వ్యాపారాలు వినియోగదారులకు కొన్ని వ్యాపారాలు వినియోగదారులకు ఎలక్ట్రానిక్ చెల్లింపు సౌకర్యాన్ని అందించాలి. 269 బదిలీని అనుమతిస్తోందని, డెలివరీదారుడి నుంచి నగదు వెళ్లే ఈ రసీదు స్వభావం ఏంటని ప్రశ్నించారు. యూపీఐలో అది ఎవరికి అందుతుంది అని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీని చట్టపరమైన మూలం ఏంటని జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. ఈ ఛార్జీల వల్ల ప్రభుత్వానికి ఏమీ రాదని, చెల్లింపుల వ్యవస్థలో బ్యాంకులు, చెల్లింపు అగ్రిగేటర్ల మధ్య ఈ మొత్తం పంచుకునే ఒక సెటిల్‌మెంట్ ఫీజుగా ఉంటుందని ఏఎస్‌జీ వివరించారు. యూపీఐ వ్యవస్థ పనితీరుకు మద్దతు ఇచ్చే దానికి ఛార్జీలు అవసరమని కేంద్రం వాదించింది. ఈ ఛార్జీలకు చట్టపరమైన ఆధారం ఏంటని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ కేసులో ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

# టోల్ బూత్‌లకు గుడ్‌బై.. ఇక నాన్‌స్టాప్ జర్నీ!

టోల్ ప్లాజాల వద్ద ఇక పడిగాపులు అవసరం లేదు
మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానానికి శ్రీకారం
వాహనాలు ఆగకుండానే టోల్ వసూళ్లు
ఫాస్టాగ్‌తోపాటు నంబర్ ప్లేట్ స్కానింగ్
ఆర్ఎఫ్ఐడీ, కెమెరాలు, సెన్సర్లతో ఆటోమేటిక్ టోల్
ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకున్నా నంబర్ ప్లేట్‌తో గుర్తింపు
తెలంగాణలో 11 టోల్ ప్లాజాలకు కొత్త విధానం
టెండర్ల ప్రక్రియలో ఎన్‌హెచ్ఏఐ, ఐహెచ్ఎంసీఎల్
మరో ఐదారు నెలల్లో అమల్లోకి వచ్చే అవకాశం
గుజరాత్‌లో ప్రయోగం.. ఇతర రాష్ట్రాలకు విస్తరణ



హైదరాబాద్

జాతీయ రహదారులపై ప్రస్తుతం ఫాస్టాగ్ విధానంలో కూడా వల్ల టోల్ బూత్ల వద్ద వాహనాలు ఆగి ముందుకు కదలాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. పండుగ సెలవు దినాల్లో సొంతూర్లకు వెళ్లే వారితో రోడ్లపై వాహనాల రద్దీ ఉంటుంది. అలాంటి వేళల్లో టోల్ బూత్ల వద్ద వాహనదారులు వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ఇక ఈ సమస్యకు చెక్ పెట్టడమే లక్ష్యంగా.. మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానం తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా టోల్ వసూళ్లలో కొత్త అధ్యాయానికి కేంద్రం శ్రీకారం చుడుతుండగా.. తెలంగాణలోనూ ఈ సిస్టమ్ అమల్లోకి రాబోతోంది. రాష్ట్రంలోని 11 టోల్ ప్లాజాల్లో మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానాన్ని ఏర్పాటు చేసేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో ఐదారు నెలల్లో కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రస్తుత టోల్ విధానానికి స్వస్తి : ఇక టోల్ ప్లాజా దగ్గర కనిపించేది సాంప్రదాయ బూత్ కాదు.. ప్రతి లేన్ గ్యాంట్రీలకు ఆర్ఎఫ్ఐడీ రీడర్లు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు, సెన్సార్లు, రాడార్, లిడార్ తదితర పరికరాలు అమర్చుతారు. వాహనం గ్యాంట్రీ కింద నుంచి వెళ్లగానే.. దాని ఫాస్టాగ్, నంబర్ ప్లేట్‌ను గుర్తించి స్కాన్ చేసి.. వాహనం వివరాలను గుర్తిస్తాయి. ఆ సమాచారాన్ని నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థకు పంపిస్తాయి. టోల్ మొత్తం ఆటోమేటిక్‌గా పనిచేస్తుంటుంది. ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్ అయినా వాహనం మాత్రం ఆగకుండా ముందుకు ప్రయాణం ముందుకు సాగుతుంది. అంటే.. నో బూత్.. నో బారియర్.. నో వెయిటింగ్.. జస్ట్.. డ్రైవ్ చేయాల్సి ఉంటుంది.

ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోతే : ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోయినా ప్రయాణం చేయవచ్చు. రిఫైడ్ రీడర్ ఫాస్టాగ్‌ను గుర్తించలేకపోయినా.. హై-రిజల్యూషన్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తాయి. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా టోల్ లావాదేవీ నమోదు అవుతుంది. తక్కువ బ్యాలెన్స్ ఉన్నట్లయితే వాహనదారుడికి 24 గంటల గడువు ఇచ్చి ఫాస్టాగ్ రిచార్జ్ చేసుకుని టోల్ చెల్లించే అవకాశం కల్పించే విధానం ఉంటుంది. ఆ గడువులో చెల్లించకపోతే.. ఈ-నోటీస్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.

తెలంగాణలో 11 టోల్ ప్లాజాలు : ఈ కొత్త టెక్నాలజీ తెలంగాణ జాతీయ రహదారులపైనా అడుగుపెట్టబోతోంది. ఇందుకోసం రాష్ట్రంలోని 11 టోల్ ప్లాజాలను ఇందుకోసం ఎంపిక చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. కంపెనీల ఎంపిక ప్రక్రియ పూర్తయితే మరో ఐదారు నెలల్లో కొత్త విధానం అమల్లోకి వచ్చేలా కసరత్తు జరుగుతోంది.

గుజరాత్‌లో ప్రయోగం.. ఇప్పుడు తెలంగాణలో విస్తరణ : ఈ మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానం దేశంలో తొలుత గుజరాత్‌లోని ఎన్ హెచ్ -48పై చోరయాసి టోల్ ప్లాజా వద్ద ప్రయోగాత్మకంగా చేపట్టారు. అక్కడి అనుభవాల ఆధారంగా దేశంలోని మరిన్ని జాతీయ రహదారులపై ఈ విధానాన్ని విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. తెలంగాణతోపాటు రాజస్థాన్.. ఢిల్లీ.. మహారాష్ట్ర.. తదితర ప్రాంతాల్లో దశలవారీగా ఈ విధానాన్ని ప్రవేశ పెడుతున్నారు.

# పట్టభద్రులు మన వైపే

(మొదటి తరువాయి)

ఎవరు పోటీ చేసినా గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పనిచేయాలని నేతలకు పిలుపునిచ్చారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నేతలు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. తమ కుటుంబ సభ్యులతో పాటు ఆయా జిల్లాల పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీపై యువత, నిరుద్యోగులు, విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజాదరణ తగ్గుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. యువత ఆ పార్టీకి దూరమవుతోందన్న ఆందోళన బీజేపీ అగ్రనేతల్లోనూ ఉందని ఆయన పేర్కొన్నారు.

ఇతర జిల్లాల్లోనూ గెలుపుపై ధీమా

రెండు రోజుల క్రితం వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ఆయా ప్రాంతాల్లో పార్టీ గెలుపుపై నేతలు ధీమా వ్యక్తం చేశారని కేటీఆర్ తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పార్టీ అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఆయన పట్టభద్రుల ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకున్నారు.

# స్థానిక ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

(మొదటి తరువాయి)

సిద్దిపేట, ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు ప్రజల నుంచి వచ్చిన స్పందనపై కవిత ఆరా తీశారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారో, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందో తెలుసుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతిపక్షంగా పార్టీ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక వస్తోందని ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం ఘటనపై పార్టీ స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని కవిత అన్నారు. ఏళ్లుగా రిమ్స్ ఆస్పత్రిని పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఆస్పత్రి సమస్యలపై సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని చెప్పారు. తాను రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించిన తర్వాతే ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ సమస్య ఎదురైనా పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించి వారికి అండగా నిలవాలని కోరారు. ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహిస్తున్న సమావేశాలు బుధవారం వరకు కొనసాగనున్నాయి. మంగళవారం ఉమ్మడి నిజామాబాద్, నల్గొండ జిల్లాల నేతలతో, బుధవారం ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నేతలతో కవిత సమావేశం కానున్నారు.

# చలాన్లు కట్టకపోతే కరెంట్ బిల్లుతో కలపండి!

న్యూఢిల్లీ



దేశ వ్యాప్తంగా పేరుకుపోతున్న ట్రాఫిక్ జరిమానాలకు సంబంధించిన చలాన్లపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాఫిక్ జరిమానాలను చెల్లించని పక్షంలో విద్యుత్ బిల్లులకు చలాన్ల మొత్తం జతచేయాలని సూచించింది. అలాగే జరిమానాలు వసూలు చేసేందుకు ఇతర మార్గాలను కూడా అధికారులు పరిశీలించాలని పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సుమారు రూ. 45,000 కోట్ల విలువైన ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు సుమారు రూ. 25,000 కోట్లు వసూలు అయ్యాయి.కాగా, ఇంకా సుమారు రూ.20,000 కోట్లకు పైగా ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. చలాన్ల మొత్తాన్ని వసూలు చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. చలాన్ల కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జేబీ పార్దీవాలా కీలక సూచనలు చేశారు. 'ప్రజలు ట్రాఫిక్ చలాన్లు చెల్లించకపోతే, ఆ మొత్తాన్ని వారి విద్యుత్ బకాయిల బిల్లుకు జతచేయండి. వారు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందే, లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనండి. ఈ దేశంలో ఏదో ఒక మార్గాన్ని మీరు వెతకాల్సిందే' అని అన్నారు. అలాగే చలాన్‌లు పెండింగ్‌లో ఉండే వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల పునరుద్ధరణ నిలిపివేయడం వంటి చర్యలను పరిశీలించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ వాహనాల యాజమాన్య బదిలీని నిరోధించడం, చలాన్‌లు క్లియర్ అయ్యేంత వరకు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయకపోవడం, అలాంటి వాహనాలను పరివాహన్ పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్ చేయడం, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణను నిలిపివేయడం వంటి అంశాలను కూడా పరిగణించాలని సూచించింది. మరోవైపు ఇప్పటికే జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయడం, చెల్లించని చలాన్‌లు ఉన్న వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి నిరాకరించడం వంటి ఇతర చర్యలను కూడా సుప్రీంకోర్టు చర్చించింది. వాహనాలను యాదృచ్ఛికంగా తనిఖీ చేయాలని, చెల్లించని ఈ-చలాన్ ఉన్నట్లయితే, అవసరమైతే అధికారులు దానిని స్వాధీనం చేసుకోవచ్చని కూడా కోర్టు పేర్కొంది. దేశంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకునే పరిష్కారాలను అధికారులు అన్వేషించాలని జస్టిస్ పర్దివాలా అన్నారు. అయితే చెల్లించని ట్రాఫిక్ చలాన్‌లను విద్యుత్ బిల్లులకు కలపాలన్న ఆలోచన కేవలం ఒక సూచన మాత్రమేనని, అమలు చేయడానికి ఆదేశం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత

న్యూఢిల్లీ

: ఇరాన్ శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతోపాటు బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేయడంతో పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇరాన్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో తాము అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు.అమెరికాతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ అది అంతిమ యుద్ధానికి దారితీసినా తాము ఎదుర్కొంటామని అరాగ్చీ అన్నారు. అదే సమయంలో చర్చలకూ తాము సిద్ధమేనని, ఏది జరగాలన్నది ట్రంప్ చేతిలోనే ఉందని అరాగ్చీ చెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రతిపాదనలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరించడంపై ఆయన స్పందించారు. ఈ అంశంపై దౌత్యమార్గాల ద్వారా తమకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదని చెప్పారు. అక్రమంగా ఫ్రీజ్ చేసిన తమ డబ్బులు, ఆస్తులు తమకు కావాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తమ చమురును తాము అమ్ముకోగలిగే పరిస్థితి ఉండాలన్నారు. ఘర్షణలు తగ్గించేలా చర్చలతో పరిష్కారాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాంటప్పుడు తాము హర్మూజ్‌ను తెరిచేందుకు సుముఖంగానే ఉంటామని అరాగ్చీ పేర్కొన్నారు.

## తెలంగాణ మెడికల్ విద్యార్థులకు
# ప్రభుత్వం తీరుతో నష్టం

**-ప్రభుత్వం తెచ్చిన జీవో కారణంగా తెలంగాణ బిడ్డలు రక్షణలు కోల్పోయే ప్రమాదం ఉంది**
**-ఈ విపత్తుకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజమంతా పోరాటం చేయాలి**
**-తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**






హైదరాబాద్ : సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ): మెడికల్ సీట్లలో స్థానికత మార్చే విధంగా ప్రభుత్వం తెచ్చిన జీవో లు 33, 150 ల కారణంగా పెను ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఈ జీవోలతో తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతుందని..ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం చేసే ఇలాంటి జీవోలను రద్దు చేయాల్సింది పోయి..సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున అడ్వకేట్ దాన్ని డిఫెండ్ చేయటమేమిటనీ ప్రశ్నిస్తూ సోమవారం వీడియో సందేశం విడుదల చేశారు. వెంటనే ఈ జీవోలను వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ తెచ్చుకున్నదే ఇక్కడి ప్రజలకు అన్ని రంగాల్లో సర్వ హక్కుల కోసమని..కానీ కాంగ్రెస్ సర్కార్ ఆ హక్కులనే హరించేలా జీవోలు తెస్తోందని మండిపడ్డారు. 1 నుంచి 7 వ తరగతి వరకు చదివిన వాళ్లను స్థానికులుగా భావించాల్సింది పోయి 8 వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు ఇక్కడ చదివిన వాళ్లకు స్థానికులుగా అవకాశం ఇవ్వటమేమిటనీ ఆమె నిలదీశారు. దీని కారణంగా తమ పిల్లలు నష్టపోతున్నారని ఇప్పటికే విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మెడికల్ సీట్లలో తీసుకొచ్చిన ఈ స్థానికత విధానాన్ని రేపు అన్ని రంగాల్లో అమలు చేస్తారని..అదే జరిగితే తెలంగాణ యువత పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుందన్నారు.

**విపత్తుకు వ్యతిరేకంగా గళమెత్తాలి**

ప్రభుత్వం తెచ్చిన జీవోలు తెలంగాణకు విపత్తు లాంటివని కవిత హెచ్చరించారు. దీనిపై కచ్చితంగా తెలంగాణ సమాజమంతా ప్రశ్నించాల్సిన అవసరముందని చెప్పారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో జేఏసీ ఛైర్మన్ గా ఉన్న ప్రొఫెసర్ కోదండ రాం ఈ అంశంపై గళమెత్తాలని..విద్యార్థులకు జరిగే నష్టాన్ని ప్రభుత్వానికి వివరించాలని కోరారు. అదే విధంగా తెలంగాణ మేధావి వర్గం, యువత, విద్యార్థులు అంతా కూడా ఈ జీవోలను వ్యతిరేకించాలన్నారు. ఇప్పటికే గ్రూప్ -1 లో స్థానికత అంశం కారణంగా తెలంగాణ విద్యార్థులు ఎంతో నష్టపోయారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరిగే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని సూచించారు. లేదంటే తెలంగాణ ప్రజలు సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెట్టటం ఖాయమన్నారు.

## చీఫ్ ఎలక్షన్ కమిషనర్
# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**- దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ డిమాండ్**



నల్లగొండ, సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ): బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

**ఓటు చోరీపై కాంగ్రెస్ ధర్నా**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR), ఓటర్ల పేర్ల తొలగింపులో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ ఈ ధర్నా చేపట్టారు. ఓటు చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు సురక్షితంగా ఉండేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పారదర్శకత లేకుండా ఎన్నికలా?**

"ఓటర్ల జాబితా, (SIR) ప్రక్రియకు సంబంధించి అనేక అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరి పేర్లు తొలగించారు, ఎందుకు తొలగించారు అనే విషయాలపై పారదర్శకత అవసరం. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర, స్వతంత్ర పరిశీలన జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఈసీ రాజీనామా
# డిమాండ్‌తో కాంగ్రెస్ నిరసన ర్యాలీ



హైదరాబాద్ (సెప్టెంబర్ 28) (నవ సంఘర్షణ): భారత ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయత, సంస్థాగత సమగ్రతను పరిరక్షించాలనే డిమాండ్‌తో టీపీసీసీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీకి టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంగోత్ వెంకటేష్ పవార్ పాల్గొన్నారు. ఆయనతో పాటు ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హంగర్గా గ్రామ పంచాయతీకి రూ.50 వేల ట్యాబ్ విరాళం

**- దాత సుభాష్ గుప్తాను కొనియాడిన సర్పంచ్ ఉదయ్ భాస్కర్**





కోటగిరి / పోతంగల్ సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ): పోతంగల్ మండల కేంద్రంలోని హంగర్గా గ్రామ పంచాయతీ కార్యాలయ అవసరాల కోసం హైదరాబాద్ లో ఉద్యోగ నిమిత్తం ఉంటున్న సుభాష్ గుప్తా రూ. 50,000 విలువ గల ట్యాబ్ ను విరాళంగా అందించారు. సర్పంచ్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో బ్యాంకు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే గత 20 సంవత్సరాలుగా సొంతంగా అంధుల కోసం ఆశ్రమాన్ని నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. తన స్వగ్రామమైన హంగర్గా అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటారని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ పనులు మరింత వేగవంతంగా నిర్వహించేందుకు ఈ ట్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. దాత సుభాష్ గుప్తాకి గ్రామ పంచాయతీ తరపున తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్ సెక్రెటరీ గంగారం వార్డు మెంబర్లు బజరంగ్ గోపాల్ శ్రీనివాస్ లక్ష్మి రమాబాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లీస్టులో పేరున్న
# మిషన్ ఇవ్వలేరని పిర్యాదు




నారాయణఖేడ్, సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ): ఖేడ్ మున్సిపాలిటీలోని అర్హులైన ముస్లిం మైనార్టీ పేద మహిళలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిల చేతులమీదుగా ఈనెల 26న కుట్టుమిషన్ లను పంపిణి చేశారు. 200 మంది లబ్దిదారులకు కుట్టు మిషన్ లు పంపిణి చేశారు. మున్సిపాలిటీలోని 14వ వార్డుకు చెందిన నస్రీన్ బేగం 164వ వరుస నంబర్ కు కుట్టు మిషన్ వచ్చినట్లు, పంపిణి ప్రదేశానికి వచ్చి తీసుకెళ్లాలని ఆమెకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు అధికారులు. అక్కడికి వెళ్ళాక లబ్దిదారురాలి ఆధార్ కార్డ్, సంతకం తీసుకుని మిషన్ లు అయిపోయాయి వెళ్ళండని పంపించేశారు. తనకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ బాధితురాలు సోమవారం ప్రజావాణిలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్. ఉమాహారతికి పిర్యాదు చేశారు.

## బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు
# శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో మహా అన్నదానం

**దైవానుగ్రహంతో కూడిన శక్తి- అడికేష్ లింగమయ్య**



కోటగిరి / పోతంగల్ సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ): కోటగిరి మండలం కేంద్రంలోని లింగాపూర్ శివారులో వెలసిన స్వయంభూ శ్రీ శ్రీ శ్రీ ఆడికేష్ లింగమయ్య దేవస్థానంలో ప్రముఖ వ్యాపారవేత్త బీఆర్ఎస్ నాయకులు మోరిల్ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో అన్నప్రసాదం వడ్డించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన మోరిల్ శ్రీనివాస్ రావును ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మోరిల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆడికేష్ లింగామయ్యను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. పచ్చని చెట్లతో కూడినటువంటి ఈ కొండలలో శివయ్య దర్శనం చేసుకోవడం కొత్త అనుభూతిగా ఉందని పేర్కొన్నారు. ఈ ఆలయంలో దైవానుగ్రహంతో కూడిన శక్తి ఉందని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే సోమవారాలలో దాతలు ఎవరు లేనట్లయితే తన వంతుగా మహన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## పర్యాటకంతో సమ్మిళిత అభివృద్ధి



ప్రపంచ దేశాల్లో 5వ అతి పెద్ద పర్యాటక మార్కెట్ కలిగిన దేశంగా భారత్ నిలుస్తూ వచ్చే ఏడాది నాటికి 3వ అతి పెద్ద పరిశ్రమగా పర్యాటకాన్ని నిలపడానికి జోరుగా పథక రచనలు, అమలు జరుగుతుండడం హర్షదాయకం. భారత పర్యాటక రంగంలో సాంస్కృతిక, సాహస, పర్యావరణ లేదా ఎకో, వైద్య, వంట, క్రీడ, గ్రామీణ, ఆధ్యాత్మిక, వ్యాపార పర్యాటక విభాగాలు దేశ వైవిధ్యత, వారసత్వ సంపద, సమాజ అందాలను పర్యాటకులకుకనుల విందు చేస్తున్నాయి. దేశ ఆర్థికాభివృద్ధి, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, స్థానిక ఆర్థిక పరిపుష్టి, ఉద్యోగ కల్పన, జిడిపిలో వృద్ధి, ప్రాంతీయ అభిభివృద్ధి, సాంస్కృతుల సంరక్షణ, విదేశీ మారక ద్రవ్యం, సాంస్కృతిక వినిమయం, మౌళిక వనరుల కల్పన లాంటి ప్రయోజనాలతో పర్యాటకం దేశ అభ్యున్నతికి తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నది. 2024 ట్రావెల్ టూరిజం అభివృద్ధి సూచిక ప్రకారం 119 దేశాల జాబితాలో భారత్కు 39వ స్థానం కల్పించబడింది. ఇదే జాబితాలో 2021లో భారత దేశ స్థానం 54గా నమోదు అయ్యింది.

పర్యాట పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి ఆ రంగాన్ని దినదినం సమగ్రాభివృద్ధి చేయడం, దేశ ఆర్థికానికి ఊపిరులూదడం, సంస్కృతి వారసత్వ సంపదలను కాపాడడం, దేశ విదేశీ పర్యాటకులన ప్రోత్సహించడం లాంటి అంశాలను అవగాహన కల్పించడానికి యూఎన్ వరల్ టూరిజమ్ ఆర్గనైజేషన్ చొరవతో, ఆ సంస్థ ఏర్పడిన రోజును గుర్తించి ప్రతి ఏట 27 సెప్టెంబర్ రోజుల ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించడం జరుగుతున్నది. స్వతంత్ర భారతంలో ఇంక్రెడిబుల్ ఇండియా లేదా అపురూప భారతం అనే నినాదంతో పర్యాటక రంగానికి పెద్ద పూట వేయాలని భావించి ప్రతి ఏట 25 జనవరి రోజున జాతీయ పర్యాటక దినం పాటించడం జరుగుతోంది. ప్రపంచ పర్యాటక దినం-2026 ఇతివృత్తంగా డిజిటల్ ఎజెండా, కృత్రిమ మేధతో పర్యాటకాన్ని పునర్-రూపక్పన (డిజిటల్ ఎజెండా అండ్ ఏఐ టి రీడిజైన్ టూరిజం) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పర్యాటక పరిశ్రమ విస్తరణతో ఆయా ప్రాంతాల అన్ని వర్గాల ప్రజలు లాభపడడంతో సమ్మిళిత అభివృద్ధి సుసాధ్యం అవుతున్నది.

2019లో భారతంలో పర్యాటక ద్రవ్య వినియోగం 127 బిలియన్ డాలర్లు ఉండగా, 2023లో 174 బిలియన్ డాలర్లకు పెరిగింది. పర్యాటక పరిశ్రమతో దేశ ఆర్థికాభివృద్ధి ఎంతగానో జరుగుతున్నది. దేశ పర్యాటక పరిశ్రమ గత ఏడాది రూ:21 ట్రిలియన్లు జిడిపికి జమకాగా, 43 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడి, 2023-24లో 2.3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించడం విశేషంగా చెప్పుకోవాలి. భారత పర్యాటకంలో 65 శాతం వరకు తమిళనాడు, యూపీ, మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ అనే ఐదు రాష్ట్రాలు మాత్రమే నమోదు చేసుకుంటున్నాయి. వైవిధ్యభరిత భారతంలో తాజ్మహల్, అజంతా ఎల్లోరా గుహలు, మహాబలిపురం, హంపీ, హవా మహల్, ఆగ్రా ఫోర్ట్, చార్మినార్ లాంటి ప్రధాన ప్రదేశాలతో పాటు పుష్కర ఫేర్లు, తాజ్ మహోత్సవ్, సూరజ్ కుండ్ మేళా, కుంభ మేళా లాంటివి కూడా విశేషంగా దేశ విదేశ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రయాగ్ రాజ్లో నిర్వహిస్తున్న 45 రోజుల మహా కుంభ మేళాకు దాదాపు 40 కోట్ల భక్తులు హాజరు అవుతారని అంచనా వేశారు. వీటికి తోడుగా అందమైన బీచ్లు, హిల్ స్టేషన్స్, అద్భుత వారసత్వ కట్టడాలు, సుందర సహజ ప్రకృతి కమనీయాలు, మనసును మెప్పించే బ్యాక్వాటర్ అలలు, ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ పర్యాటక పరిశ్రమకు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయి. భారత ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పలు పర్యాటక ప్రోత్సాహక పథకాలను ప్రకటిస్తూ, ఆచరణలో పెట్టడంతో ఈ రంగం దినదినాభివృద్ధిని నమోదు చేసుకుంటున్నది. మౌళిక వసతుల కల్పన, సేవల విస్తరణ, దేశ విదేశీ పర్యాటకాలను ఆకర్షించడం లాంటి లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి ఇంక్రెడిబుల్ ఇండియా 2.0, స్వదేశీ దర్శన్ పథకం, దేఖో అప్నా దేశ్, ప్రసాద్ స్కీమ్, నిచే టూరిజం, ఈ-విసా సౌకర్యం, జిఎస్టి తగ్గింపు, నిధిం డిజిటల్ పథకం లాంటివి ఆచరణలో పెట్టబడినవి. ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన, స్థానిక ప్రదేశాల అభివృద్ధి, మౌళిక వసతుల పెంపు, లాంటివి పర్యాటక పరిశ్రమతో సుసాధ్యం కావడం వల్ల ఆ రంగాన్ని మరింత విస్తరించడానికి ప్రభుత్వాలతో పాటు సాధారణ పౌర సమాజం కూడా తమ వంతు కర్తవ్యాలను నిర్వహించి మేరా భారత్ మహాన్ అంటూ నినదిద్దాం, భరతమాత సౌందర్యాన్ని ఇనుమడింపజేద్దాం

# డిజిటల్ యుగంలో భాషా పరిణామం



నేటి డిజిటల్ యుగంలో మనం 1997 నుంచి 2012 మధ్య జన్మించిన తరాన్ని 'జెన్-జీ' (జనరేషన్ జెడ్) అని పిలుస్తున్నాం. ఇంటర్నెట్, సోషల్ మీడియా, స్మార్ట్ఫోన్ల ఒడిలోనే పెరిగిన ఈ తరం సృష్టించుకున్న భాషా సంస్కృతి గత తరాల కన్నా భిన్నమైనది, విలక్షణమైనది. ఈ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఆధునిక యువత సంభాషణ శైలినే సాధారణంగా 'జెన్-జీ భాష' అని పిలుస్తున్నాం. 'జెన్-జీ' భాష అనేది డిజిటల్ మాధ్యమాలు సృష్టించిన కొత్త సమాచార అవసరానికి ప్రతిస్పందన. ఇది భాష క్షీణత కాదు. భాషా పరమైన ఒక 'సరికొత్త మాండలికం' గా పరిగణించాలి. ఈ సమాజపు జీవనశైలికి, ఆలోచనా విధానానికి, సంస్కృతికి, కాలానుగుణ వస్తున్న మార్పులకు ఈ 'జెన్-జీ' భాష అద్దం పడుతుంది. ఒకప్పుడు ఉత్తరాలు, తర్వాత ఫోన్ సంభాషణలు, ఆ తర్వాత ఎస్ఎంఎస్లు, ఇప్పుడు వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్, థ్రెడ్స్, యూట్యూబ్, షార్ట్ వీడియోల వంటి డిజిటల్ మాధ్యమాలు సంభాషణ పద్ధతిని గణనీయంగా మార్చాయి. పూర్వం గ్రాంథికం నుంచి వ్యావహారిక భాషోద్యమం వచ్చినట్టే నేడు వ్యావహారికంలో నుంచి డిజిటల్ వ్యక్తీకరణల దిశగా మార్పులు జరుగుతున్నాయి. జెన్-జీ యువత తమ భావాలు, అంతరంగాలను అత్యంత వేగంగా, సమర్థవంతంగా వ్యక్తీకరించడానికి ప్రస్తుతం సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దేశ రాజకీయాల్లో కూడా ఈ ప్రకంపనలు చూశాం.. చూస్తున్నం కూడాను. ఈ 'జెన్-జీ'లు వాడుతున్న భాషను నిశితంగా పరిశీలిస్తే మనకు కొన్ని స్పష్టమైన అంశాలు కనిపిస్తాయి. ముఖ్యంగా వేగం, సంక్షిప్తత, సృజనాత్మకత, హాస్యం, భావోద్వేగాల వ్యక్తీకరణ, ఇతర భాషల కలవడం ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. అట్లనే వేగంగా చాటింగ్ చేయడానికి పదాలను కుదించి వాడడం ప్రాథమిక లక్షణంగా కనిపిస్తున్నది. ఉదాహరణకు ఐడీకే (ఐ డోన్ట్ నో), ఎఫ్ఆర్ (ఫర్ రియల్), టీబీహెచ్ (టు బీ హానెస్ట్), ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) వంటి పదాలు. అట్లానే ఒక విషయాన్ని లేదా భావాన్ని వ్యక్తపరచడానికి కొత్త పదాలను నిర్మిస్తున్నారు. ఉదాహరణకు ఘోస్టింగ్ (హఠాత్తుగా మాట్లాడడం మానేయడం), ఫ్లెక్స్ (గొప్పలు చెప్పుకోవడం), రిజ్ (ఆకర్షించే నైపుణ్యం), స్లే (అద్భుతంగా చేయటం) వంటి కొత్త పదాలు విస్తృతంగా నేడు వాడుకలో ఉన్నాయి. ఈ జెన్-జీ భాష కేవలం అక్షరాలకు మాత్రమే పరిమితం కాకుండా ఎమోజీలు, మీమ్స్, జిఫ్ల ద్వారా సమాచారాన్ని వ్యంగ్యంగా, సూటిగా, తక్కువ సమయంలో ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక రకంగా లిఖిత-దృశ్య రూపాల సమ్మేళనం.

నేడు తెలుగు, ఇంగ్లిష్, హిందీ మొదలైన 'భాషల మిశ్రమ' పదజాలం సంక్షిప్త రూపంలో కనిపిస్తున్నది. ఉదాహరణకు ఈ సినిమా చాలా బాగుంది అని తెలుగులో అంటాం. దీన్ని జెన్-జీ భాషా శైలిలో సినిమా ఫుల్ ఫైర్ అని చెప్తుంటారు. నాకు అతని ప్రవర్తన నచ్చలేదు. జాగ్రత్తగా ఉండాలి అనడానిక జెన్-జీలు అతని బిహేవియర్ చూస్తే రెడ్ ఫ్లాగ్ మాట్లాడుతారు. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావు అనే మాటను జెన్-జీలు ఓవర్ థింకింగ్ చేయకు, చిల్ అని క్లుప్తంగా అంటుంటారు. ఎవరైనా అకస్మాత్తుగా మాట్లాడటం మానేస్తే, నన్ను గోస్ట్ చేశారు అని చెప్తారు. నీ పని చాలా అద్భుతంగా ఉన్నది అని అనడానికి ఇది ఫుల్ స్లే అని వ్యాఖ్యానిస్తుంటారు. ఇవే కాకుండా ఇంకా సోషల్ మీడియా మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతున్న కొన్ని పదాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉదాహరణకు ఫుల్ వైబ్, టైమ్ పాస్, క్రష్, లిటరల్లీ, రియల్, రెడ్ ఫ్లాగ్, గ్రీన్ ఫ్లాగ్, చిల్, ఫైర్, బ్లాస్ట్, మాస్, అదుర్స్, గూస్ బంప్స్, ఓఎంజీ, ఎల్వోఎల్, మ్యూట్, టాక్సిక్, స్పేస్ మొదలైనవి.

**తెలుగులో ఇంగ్లిషు పదాలు సహజంగా కలిపి మాట్లాడడం**

కనిపిస్తున్నప్పటికీ ఇది గతంతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ మాధ్యమాల కారణంగా మరింత వేగం పుంజుకున్నది. విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఒకరకంగా నేడు 'సోషల్ మీడియా ఒక నూతన భాష ప్రయోగశాల'గా మారుతున్నది. ప్రస్తుత భాషావేత్తలకు, భాషాభిమానులకు ఈ జెన్-జీ భాషపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. కొందరు దీనిని భాషా పరిణామానికి సహజ రూపంగా, యువత కొత్త అనుభవాలకు, కొత్త సాంకేతికతకు నిదర్శనంగా భావిస్తున్నారు. మరోవైపు మాతృభాషలో ఇంగ్లిష్ పదాల అధిక వినియోగం వల్ల తెలుగు పదజాలం మరుగున పడే ప్రమాదం ఉన్నదని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా భాషను ఒకే చోట నిలిచిపోయే వస్తువుగా చూడలేం కాలంతో పాటు భాష కూడా మారుతున్నది. ఒక తరం ఉపయోగించిన పదాలు మరో తరానికి కొత్తగా అనిపించవచ్చు. కానీ, తర్వాత అవే సాధారణ భాషలో భాగమవుతాయి. అందువల్ల జెన్-జీ భాషను అర్థం చేసుకోవడం అంటే నేటి యువత ఆలోచన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే. అందుకే వివిధ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు డిజిటల్ భాషా పరిజ్ఞానం అవసరాన్ని గుర్తించి 'తెలుగు భాష సాంకేతికత' అనే పాఠ్యాంశాలను కూడా జోడిస్తున్నాయి. ప్రస్తుతం ఈ 'జెన్-జీ' వాడుతున్న భాషను చాలామంది వ్యాకరణం లేని భాషగా లేదా సంప్రదాయ భాషకు ముప్పుగా అభివర్ణిస్తున్నారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా విస్తరిస్తున్న ఈ నూతన సంభాషణల ధోరణిని భాషా సహజ గుణంగా గుర్తించి అర్థం చేసుకోవడమే సమగ్రమైన వైఖరి. భాష మారడం అనేది భాష బలహీనత కాదు. మారుతున్న సమాజాన్ని స్వీకరించే భాషా చైతన్యానికి ఒక సంకేతంగా పరిగణించాలి. అయితే మార్పును స్వీకరిస్తూనే మాతృభాష మూలాలను కాపాడుకోవడం కూడా ఇప్పుడు మన ముందున్న బాధ్యత, అతిపెద్ద సవాలు కూడాను.

# అతి వివాదాస్పద స్పీకర్లు ఎవరు?

**భారతదేశ పార్లమెంటరీ చరిత్రలో వివాదాస్పదులు, అతి వివాదాస్పదులు అయిన చట్టసభల స్పీకర్లు ఎవరు? వారు ఎందరుంటారు? దిగువ సభల వారిని స్పీకర్లు అని, ఎగువ సభల వారిని చైర్మన్లు అంటారు. పార్లమెంటు ఉభయ సభల నుంచి మొదలుకొని దేశవ్యాప్తంగా గల ఉభయ సభల వరకు గల వారు ఈ 80 ఏండ్లలో వందల మంది ఉంటారు. వీరుగాక, సభాపతులు లేని సమయాల్లో తాత్కాలికంగా అధ్యక్షత వహించే ప్యానెల్ సభ్యులుంటారు. వారిని కూడా కలిపితే అనేక వేలవుతారు. సంఖ్య ఎంతైనప్పటికీ ప్రతి ఒక్కరి బాధ్యతా సభా వ్యవహారాలు అన్నింటినీ నియమ నిబంధనల ప్రకారం, నిష్పక్షపాతంగా నిర్వహించటం. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యుల హక్కులను కాపాడటం. వీరందరిలో అట్లా నడుచుకున్నవారు ఎందరుంటారు? ఆ స్థానానికి అప్రతిష్టను తెచ్చినవారు ఎందరుంటారు?**



ఈ ప్రశ్నల ప్రకారం ప్యానెల్ సభ్యులను వదలివేసినా తక్కినవారి విషయమేమిటి? స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, సభాపతుల గురించి పేరు పేరునా జరిగిన అధ్యయనాలు ఏవీ ఉన్నట్టు లేవు. ఆ పని జరగటం ఎంతైనా ఉపయోగపడుతుంది. అయితే పేర్లవారీగా అధ్యయనాలు లేకపోయినా స్థూలంగా ఎవరేమిటన్న వ్యాఖ్యానాలు సమకాలీనంగా వెలువడుతూనే ఉన్నాయి. ఉదాహరణకు మొదటి స్పీకర్ జీవీ మావ్లంకర్ (1952-56) నుంచి మొదలుకొని ఎం.ఏ అయ్యంగార్ (1956-62), సర్దార్ హుకుమ్సింగ్ (1962-67), నీలం సంజీవరెడ్డి (1967-69, 1977) వరకు బాగా చెప్పుకొంటారు. తర్వాత నుంచి మొదలైన వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఈ నలుగురిలోనూ సంజీవరెడ్డికి ఒక ప్రత్యేకత ఉన్నది. స్పీకర్గా పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అట్లా చేసిన మొదటి నాయకుడు ఆయన. స్పీకర్గా తటస్థంగా పని చేయాలంటే రాజీనామా అవసరమన్నారు. మొదటి స్పీకర్ మావ్లంకర్ పూర్తి నిష్పక్షపాతే. కానీ రాజీనామా చేయలేదు. అందుకు తను చెప్పిన కారణం, తిరిగి పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ తనకు టికెట్ ఇస్తుందనే నమ్మకం లేదన్నది. మాజీ స్పీకర్లపై ఏ పార్టీ కూడా పోటీ పెట్టని బ్రిటిష్ సంప్రదాయాన్ని ఇక్కడ అమలుకు తేవాలని ఆయన సూచించారు గానీ అందుకు ప్రతిపక్షాలు ఒప్పుకోకపోవచ్చునంటూ అప్పటి ప్రధాని నెహ్రూ నిరాకరించారు. అదే సమయంలో విశేషమేమంటే, ఒకవేళ మావ్లంకర్ రాజీనామా చేసినట్టయితే మరుసటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వగలదనే హామీని మాత్రం ఇచ్చినట్టులేదు. ఇది ఇంతగా రాయటం ఎందుకంటే, స్పీకర్లూ వారి పార్టీల మధ్య సంబంధం చర్చ ఆ విధంగా మొదటి లోక్సభ నుంచే కొనసాగుతూ వస్తున్నది. బ్రిటిష్ రాజ్యాంగం నుంచి, పార్లమెంటరీ సంప్రదాయాల నుంచి అనేకం అనుసరించిన మన పెద్దలు ఎందువల్లనో గానీ ఈ ఉత్తమమైన పద్ధతిని మాత్రం పక్కకుపెట్టారు. ఈ లోపం క్రమక్రమంగా, ముఖ్యంగా నెహ్రూ తర్వాత కాలం నుంచి అనేక అనర్థాలకు దారితీసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో స్పీకర్ నాదెండ్ల మనోహర్ అయితే ప్రతిరోజూ కాంగ్రెస్ కండువాతో సభాపతి స్థానాన్ని అలంకరిస్తూ అందులో తప్పేమీ లేదని వాదించారు. ఆ పని దేశంలో మరెవరూ చేసినట్టులేరు. రోజువారీ సభాకార్యక్రమాల్లో ప్రతిపక్షాలకు తగిన సమయం ఇవ్వకపోవటం, వారి ప్రసంగాలు ప్రధానమంత్రికి లేదా ముఖ్యమంత్రికి, లేదా ప్రభుత్వానికి ఇబ్బందికరమనిపించినప్పుడు మైక్ కట్ చేయటం, వారి చర్చా తీర్మానాలను నిర్హేతుకంగా తోసిపుచ్చటం, ప్రశ్నలకు మంత్రులు తగిన సమాధానాలు ఇవ్వకున్నా వారిని కాపాడటం, పాయింట్ ఆఫ్ ఆర్డర్లను నిరాకరించటం, ప్రతిపక్షాలపై విరుచుకుపడి మాట్లాడనివ్వని అధికారపక్షాన్ని నియంత్రించకపోవటం, ప్రతిపక్ష సభ్యులను కాపాడకపోవటం వంటి దుర్వినియోగాలు సర్వసాధారణంగా మారాయి. మన ప్రజాస్వామ్య వ్యవస్థ పతనానికి ఇదికూడా ఒక సూచిక అయింది. స్పీకర్లు ఇంతకుమించిన ఆయుధాలుగా మారుతున్నది ప్రతిపక్షాల నుంచి ఫిరాయింపులు, అధికారపక్షంలో చేరటాలు, ఆ ప్రక్రియలకు గుర్తింపునివ్వటం వంటి సందర్భాల్లో. ఈ జాడ్యం లోక్సభ నుంచి అసెంబ్లీల వరకు కనిపిస్తున్నది. సభా ప్రాంగణం, సభ అంతర్భాగం, వాటిలో జరిగే కార్యక్రమాలు, వ్యవహారాలు సభాపతి ఆధీనంలోకి వస్తాయని వాటికి సంబంధించి ఆయన నిర్ణయాలను కోర్టులు సైతం ప్రశ్నించజాలవనే సంప్రదాయాన్ని, నిబంధనలను అనువుగా చేసుకుంటూ ఈ దుర్వినియోగాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కోర్టు ఉత్తర్వులను కొందరు స్పీకర్లు బాహాటంగా ధిక్కరించిన సందర్భాలను కూడా చూశాము. కోర్టులు సర్వసాధారణంగా, చట్ట సభలు, ఎన్నికల కమిషన్ వంటివి రాజ్యాంగ వ్యవస్థలు అయినందున వాటి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవు. స్పీకర్లను దుర్వినియోగపరిచే అధికారపక్షాలకు, స్వయంగా స్పీకర్లకు కూడా ఒక్కోసారి ఇది అనువుగా మారుతున్నది. దానితో, ఉన్న నిబంధనలకు ఇష్టారీతిన నిర్వచనాలు చెప్పటం, లేని నిర్వచనాలు ఇవ్వటం కూడా జరుగుతున్నది. అటువంటి నిర్వచనాలను కోర్టులు స్పష్టమైన రీతిలో తోసిపుచ్చి, పార్టీ ఫిరాయింపులను చెల్లనివిగా ప్రకటించటం ఇటీవల తెలంగాణ సహా కొన్ని అసెంబ్లీల విషయంలో చేయటాన్ని చూశాము. అనగా స్పీకర్ల సృజనాత్మక నిర్వచనాలు రాజ్యాంగ విధివిధానాలకు, చట్ట నియమాలకు విరుద్ధమైనవన్నమాట. సమస్య ఏందంటే దేశంలో ఇటువంటి ధోరణులు, దుర్వినియోగాలు పెరుగుతున్నాయి. వ్యవస్థలు, రాజకీయ నీతినియమాల క్షీణత వల్ల మొదలైన ఆయా రామ్.. గయా రామ్ సంస్కృతిని స్వయంగా కాంగ్రెస్ పార్టీయే ఆరంభించినా, దానిని అరికట్టేందుకు ప్రయత్నించిన ఖ్యాతి కూడా ఒక కాంగ్రెస్ ప్రధాని (రాజీవ్గాంధీ)కే చెందుతుంది. తిరిగి దానిని ధ్వంసం చేస్తున్నది, అందుకు సృజనాత్మక నిర్వచనాలు ఇస్తున్నది, స్పీకర్లతో ఇప్పిస్తున్నది సైతం అదే పార్టీ. అదే సంస్కృతి అన్ని పార్టీలకు పాకింది. ఫిరాయింపులు, చీలికలు, గుర్తింపులు, ప్రభుత్వాల ఏర్పా ట్లు, బలనిరూపణలకు సంబంధించి ఎస్.ఆర్ బొమ్మై కేసు ఒక ప్రముఖమైన ఉదాహరణ. తర్వాత ఎన్టీఆర్ సందర్భం. విషాదం ఏందంటే నిబంధనలు, నీతులు, తీర్పులు ఏవైనా, చట్టాలను తామే చేసినా, అన్నింటిని వమ్ము చేయటానికి స్పీకర్లు సాధనాలుగా ఉపయోగపడుతున్నారు. అధికారం కోసం నిబంధనలను బలి ఇవ్వగల అధికారం వారి చేతిలో ఉన్నది గనుక. పుణ్యం పురుషార్థమన్నట్టు తాముా ఏవో లాభాలను ఆశిస్తారు గనుక. ఈ పరిస్థితులను, పరిణామాలను గమనించినప్పుడు స్పీకర్ల గురించి చర్చించటం, ఏదైనా ఆశించటం కూడా అర్థరహితమైనదేమో. అది ఒక విధంగా గొంగట్లో కూర్చుని తింటూ వెంట్రుకలు ఏరటం వంటిది. అందువల్ల వివాదాస్పద స్పీకర్లు, అతి వివాదాస్పద స్పీకర్లు అంటూ అధ్యయనాలు చేయటం అకడమిక్ థీసిస్ల కోసం ఉపయోగపడటం తప్ప ఆచరణాత్మకమైన ఉపయోగం ఏమీ ఉండదు. దేశరాజకీయాలు, అధికార రాజకీయాలు శీఘ్రగతిన పతనమవుతున్నప్పుడు, ఎవరైనా నియమబద్ధుడైన స్పీకర్ ఎప్పుడైనా, ఎక్కడైనా ఆవిష్కృతుడు అయితే తన గురించి అందరూ తమంతట తామే చెప్పుకొంటారు. అటువంటి మావ్లంకర్లను, సంజీవరెడ్డిలను ఆ పార్టీ స్పీకర్లుగా ఎంపిక చేసుకుంటాయా అన్నది వేరే ప్రశ్న. దీనంతటిని ఆవరించి ఉన్న విస్తృత సమస్యలు కొన్ని ఉన్నాయి. అధికారంలో ఉన్నవారు తమ ప్రయోజనాల కోసం స్పీకర్ స్థానం సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలను, చట్టాలను బలహీనపరుస్తున్నారు. చట్ట సభలు, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, స్పీకర్ వ్యవస్థ మొదలైనవన్నీ అందులోకి వస్తాయి. ఈ ధోరణి ఇందిరాగాంధీతో మొదలైంది, అధికారపక్ష పరిరక్షణ కోసం. స్పీకర్ల దుర్వినియోగం గానీ, స్పీకర్లు అధికారపక్షాలకు ఉపయోగపడటం గానీ తక్కిన పరిణామాలతో సంబంధం లేకుండా జరుగుతున్నవి కావు. అన్నీ పరస్పరం సంబంధం గలవి. దీనంతటికీ మూలాలు మన పార్టీలూ, ప్రభుత్వాలూ ప్రజల మేలును, అభివృద్ధిని విస్మరించి తమ అధికారానికి, సంపాదనలకు ప్రాధాన్యతనివ్వటంలో ఉన్నాయి. ఈ ధోరణి అవినీతికి దారితీయగా, అది నిరాఘాటంగా సాగటం కోసం వివిధ వ్యవస్థలను దుర్వినియోగపరుస్తున్నారు. ఇదే క్రమంలో స్పీకర్లు కూడా పావులవుతున్నారు.. జ్ఞానేశ్కుమార్ వంటి ఎన్నికల కమిషనర్లవలెనే. ఈ దోషం ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అనబడే జాతీయ పార్టీలదే. వారు పాలనా వైఫల్యాలతో ప్రజాదరణ కోల్పోయి, అధికార పరిరక్షణ కోసం ఇలాంటి వక్రమార్గాలను అనుసరిస్తున్నారు. అది అసలు రహస్యం.

## పట్టభద్రుల ఓటర్ల నమోదుకు

# డీ-నోవో నోటీసు

**-నవంబర్ 6లోగా ఫారమ్--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

**-షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయ నోటీసు బోర్డులో షెడ్యూల్ ప్రదర్శన**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ):** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ తెలంగాణ శాసనమండలి స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించేందుకు డీ-నోవో ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన అధికారిక నోటీసు, షెడ్యూల్‌ను షాద్‌నగర్ ఆర్డీఓ, సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎస్.ఆర్. సరిత కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించారు. 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల క్రితమే పట్టా పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఫారమ్--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణకు 2026 నవంబర్ 6ను తుది తేదీగా నిర్ణయించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాను డీ-నోవో పద్ధతిలో కొత్తగా రూపొందిస్తున్నందున గతంలో ఓటరుగా నమోదైన పట్టభద్రులు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఎన్నికల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారమ్--18 సమర్పించవచ్చు. దరఖాస్తుతో పాటు డిగ్రీ, డిప్లొమా ధ్రువపత్రం లేదా మార్కుల పట్టిక వంటి విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలు ఉన్నాయి.

ఒక వ్యక్తి లేదా సంస్థ పెద్ద సంఖ్యలో దరఖాస్తులను సమూహంగా సమర్పించే విధానం చెల్లదని అధికారులు స్పష్టం చేశారు. అయితే కుటుంబ సభ్యుల దరఖాస్తులను మరొక కుటుంబ సభ్యుడు సంబంధిత అసలు ధ్రువపత్రాలను చూపించి సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులో తప్పుడు సమాచారం ఇస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం--1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో తన పేరును నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## నెత్తురు మరిగే నిప్పుల

# కణం-షాహిద్ భగత్ సింగ్

**- సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ):** భగత్ సింగ్ 119 వ జయంతిని పురస్కరించుకొని సిపిఎం పార్టీ షాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ షాద్నగర్ పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ మాట్లాడుతూ లిదేశం కోసం దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే ఉరికేను ముద్దాడిన వీర విప్లవ యువ కిశోరుడు అని కొనియాడారు నిరాశాన్నిట్టూర్పుతో ఉన్నటువంటి యువతరానికి భగత్ సింగ్ పోరాటం ఒక ఉత్తేజ కరం అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన విప్లవ యోధుడని తెలిపారు. భగత్ సింగ్ చిన్నతనం నుంచి దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. ఒక వ్యక్తిని మరో ఒక వ్యక్తి దోచుకొని దోపిడీ లేని సమాజం కావాలని ఆ సమాజమే సోషలిజం అని నమ్మి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినదించి. అంతరాలు లేని సభ్య సమాజం కోసం సోషలిజం కోసం పనిచేశాడని గుర్తు చేశారు. అందుకోసమే భగత్ సింగ్ హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ అనే సంస్థను ఏర్పాటు చేసి పోరాటాలు కొనసాగించారని తెలిపారు. జైలు జీవితంలో భగత్ సింగ్ రాసిన పుస్తకం నేనెందుకు నాస్తికునయ్యాను అనే రచన మనువాదులకు చెంపపెట్టు అన్నారు... భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో .శ్రీకాంత్,అదిల్, రాంచరణ్, శివ గౌడ్ , సాయి గౌడ్, విష్ణు వర్ధన్, రాహుల్తదితరులు పాల్గొన్నారు.

## ఈడీ కార్యాలయ ముందు

# బీఆర్ఎస్ నేతల ధర్నా

**-పొంగులేటిపై జరిపిన సోదలోని నివేదికను బయటపెట్టాలని డిమాండ్**

**-ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, షాంబిపూర్ రాజు**

**-ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్ కుమార్,కె.పి వివేకానంద గౌడ్**

**-బీఆర్ఎస్వి నాయకులు గెల్లు శ్రీనివాస్**



**తెలంగాణ సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ):** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై గతంలో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) జరిపిన దాడుల దర్యాప్తు నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ముందు బీఆర్ఎస్వి,బీఆర్ఎస్వై ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు భారీ నిరసన చేపట్టారు.ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,శంభీపూర్ రాజు,ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్,కె.పి.వివేకానంద్ గౌడ్ విద్యార్థి నాయకులు గెల్లు శ్రీనివాస్ లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఆస్తులపై ఈడీ దాడులు జరిగి రెండేళ్లు గడుస్తున్నా,ఇప్పటివరకు ఆ దర్యాప్తులో ఏం తేలిందనే వివరాలను కేంద్ర ప్రభుత్వం కానీ,ఈడీ కానీ అధికారికంగా ప్రకటించకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఆ సోదాల తాలూకు నివేదికలో ఉన్న నిజాలను తక్షణమే పబ్లిక్ డొమైన్ (ప్రజల అందుబాటు) లో ఉంచాలని వారు తమ వినతి పత్రంలో డిమాండ్ చేశారు.రెండు సంవత్సరాలు దాటినా ఈడీ నిశ్శబ్దంగా ఉండటం వెనుక కేంద్రంలోని బీజేపీ,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందమే కారణమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.ఈడీ నివేదికపై ప్రజలకు పూర్తి క్లారిటీ ఇవ్వాలని,దర్యాప్తు వివరాలను దాచడం సరికాదని వారు పేర్కొన్నారు.బీఆర్ఎస్ నాయకుల ధర్నా,వినతి పత్రాల సమర్పణ నేపథ్యంలో ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ప్రజావాణిలో ఇచ్చిన

# కలెక్టర్ ఆదేశాల అమలులో నిర్లక్ష్యమా..?

**- షాద్‌నగర్ చౌరస్తా విస్తరణపై ప్రజావాణిలో ఆర్.ఎన్. రాము ఫిర్యాదు**




**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ):** షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ అంశంపై చౌరస్తా ఉద్యమకారుడు ఆర్.ఎన్. రాము సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో ప్రజావాణిలో కలెక్టర్ కార్యాలయం నుంచి జారీ చేసిన ఆదేశాల కాపీని షాద్‌నగర్ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.చౌరస్తా విస్తరణపై గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాము కోరినట్లు సమాచారం. ప్రజావాణిలో గౌరవ కలెక్టర్ కార్యాలయం ఆదేశాల అమలుపై షాద్ నగర్ మున్సిపల్ అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది..రాము మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ అధికారులు ప్రజావాణి నుంచి వచ్చిన ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరుతున్నట్లు తెలిపారు.

## కృష్ణజింకను వేటాడి మాంసంతో

# పట్టుబడ్డ తొమ్మిది మంది

**-షాద్‌నగర్‌లో పోలీస్, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారుల సంయుక్త ఆపరేషన్**

**-మీడియా సమావేశంలో షాద్‌నగర్ డిసిపి శిరీష రాఘవేందర్ వెల్లడి**






**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 (నవ సంఘర్షణ):** కృష్ణజింకను వేటాడి, దాని మాంసాన్ని ముక్కలుగా నరికి నగరానికి తరలిస్తున్న తొమ్మిది మంది ముఠాను షాద్‌నగర్ పోలీసులు, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి లైసెన్స్‌డ్ తుపాకీ, బుల్లెట్లు, కృష్ణజింక మాంసం, రెండు వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ శిరీష రాఘవేంద్ర వివరాలు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 26న అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు కార్లలో నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. సెప్టెంబర్ 27న ఉదయం లైసెన్స్‌డ్ తుపాకీతో కృష్ణజింకను వేటాడి చంపిన అనంతరం దాని మాంసాన్ని ముక్కలుగా నరికి ప్యాక్ చేసుకుని హైదరాబాద్ వైపు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా నిందితుల ముఠా పట్టుబడింది. విచారణలో కృష్ణజింకను తామే వేటాడినట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎం.డి. హాజీ ఉద్దీన్ (36), మీర్ ముక్తార్ అలీ (37), ఎం.డి. తాజుముల్ (37), మీర్ రాజా అలీ ఖాన్ (39), ఖుర్రం ఖాన్ (35), సయ్యద్ సల్మాన్ అలీ (30), ఎం.డి. అఫ్రోజ్ ఖాన్ (36), ఎం.డి. అబ్దుల్ అజీజ్ (33), ఎం.డి. రియాజ్ (28) ఉన్నారు.నిందితుల నుంచి .315 రైఫిల్, టెలిస్కోప్, సైలెన్సర్, 19 బుల్లెట్లు, సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, నల్లటి స్కార్పియో వాహనం, సుజుకి ఎస్-క్రాస్ వాహనం, ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు, రూ.28,590 నగదు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని 9, 39, 50, 51, 57 సెక్షన్లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వన్య ప్రాణులను వేటాడటం, చంపడం, వాటి మాంసాన్ని అక్రమంగా తరలించడం లేదా విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్యప్రాణుల అక్రమ వేటకు సంబంధించిన సమాచారం తెలిస్తే అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1800-425-5364, 040-23231440కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.మీడియా సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, ఎస్‌వోటీ పోలీసులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.'

## ప్రభుత్వం దృష్టికి

# పంచాయతీ కార్యదర్శుల సమస్యలు..

**తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి**



**నాగారం, సెప్టెంబర్ 28:- (నవ సంఘర్షణ):** రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేలా కృషి చేయనున్నట్టుగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, గ్రామ పాలనా అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు పాల్గొన్నారు. టిపిఎస్ఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ ఏ.శ్రీకాంత్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఎన్ నాగరాజు, ట్రెసరర్ ఎం శశిధర్, గౌరవ అధ్యక్షులు ఎం. సందీప్ ఈ సందర్భంగా లచ్చిరెడ్డి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. ఓపీఎస్ ద్వారా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. ఇదే కాకుండా వాళ్ళు పని చేసిన కాలాన్ని కూడా పరిగణలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలన్నారు. జూనియర్ పంచాయతి కార్యదర్సులుగా పని చేసిన నాలుగేళ్ల కాలాన్ని నోషనల్ సర్వీస్ గా గుర్తించాలని కోరారు.న్యాయబద్ధమైన ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయనున్నట్టుగా ఈ సందర్భంగా లచ్చిరెడ్డి తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అప్పుడే ప్రజలకు కావాల్సిన సేవలు అందడంతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు.

## టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తు తేల్చేందుకు ఈసీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్




**న్యూఢిల్లీ**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లో రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. టీఎంసీ పేరు, ఆ పార్టీ ఎన్నికల గుర్తు అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లోగా ఈ అంశాన్ని తేల్చాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టంది. పార్టీ పేరు, గుర్తు అంశంలో బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేశారు. అయితే టీఎంసీకి చెందిన రెండు వర్గాలు తమ వాదనలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు నాలుగు వారాల్లోగా సమర్పించాలని సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.ఇక ఈ అంశాన్ని మూడు నెలల్లోగా తేల్చాలని కూడా ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం అల్టిమేటం జారీ చేసింది. టీఎంసీ పేరు, పార్టీ సింబల్‌ను ఈసీ ఫ్రీజ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించారు. అయితే రెండు వర్గాలకు ఈసీ రెండు రకాల పేర్లు, గుర్తులను ఇటీవల కేటాయించింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇది కీలకాంశంగా మారింది.

## 'వాళ్లకు ఓటర్లంటే భయం లేదు'..

**- మంత్రి పర్వేశ్ వర్మ తీరుపై రాహుల్‌గాంధీ ఆగ్రహం..!**



ఢిల్లీలో మంత్రి పర్వేశ్ వర్మ రోడ్లను తనిఖీ చేస్తుండగా వీడియో తీసిన యువకుడిని అతడు చెంపదెబ్బ కొట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. మంత్రి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ నేతలకు ఓటర్లంటే ఏమాత్రం భయం లేదని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. తమ సమస్య గురించి ప్రశ్నించినందుకు ఓ యువకుడిని చెంపదెబ్బ కొట్టడం సరైన చర్య కాదన్నారు.వీడియోలో ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన బీజేపీ మంత్రి ఒక యువకుడిని చెంపదెబ్బ కొట్టడం కనిపిస్తోందని, అతడు చేసిన నేరం ఏమిటి..? అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రజల మధ్యలో ప్రశ్నిస్తే చెంపదెబ్బ.. పేపర్ లీక్స్ గురించి అడిగితే లాఠీఛార్జి.. పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే మైక్ స్విచ్ఛాఫ్ చేయడం.. ఇవన్నీ అధికారం ఉందనే అహంకారంతో చేసే చర్యలన్నారు. తప్పుచేస్తే ప్రజలు తమను గద్దె దించుతారనే భయం వారిలో లేదని విమర్శించారు. బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చేది ఓటు చోరీతో అని, అందుకే వారికి ప్రజల మద్దతుతో అవసరం ఉండదని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందిస్తూ.. ఇలాంటి విషయాలకు ఆయన దూరంగా ఉండాలని సూచించారు. ఆయనకు ఏమీ తెలియదని, తెలిసీ తెలియక ఏదేదో మాట్లాడుతారని వ్యాఖ్యానించారు.

## తొలిసారి భూకక్ష్యలోకి స్టార్‌షిప్

**స్పేస్‌ఎక్స్ కీలక ప్రయోగం**



న్యూయార్క్

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ అత్యంత భారీ రాకెట్ స్టార్‌షిప్‌ను తొలిసారి భూకక్ష్యలో ప్రవేశపెట్టింది. సోమవారం టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ నుంచి చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. అయితే స్టార్‌షిప్‌లోని ఓ థ్రస్టర్‌లో లోపం తలెత్తడంతో నిర్ణయించిన సమయానికి దాదాపు ఏడు గంటలు ముందుగానే మిషన్‌ను ముగించాల్సి వచ్చింది. ఈ మిషన్ సుమారు 10 గంటల పాటు కొనసాగుతుందని తొలుత అంచనా వేశారు.కానీ సూపర్ హెవీ బూస్టర్ నుంచి విడిపోయిన తర్వాత స్టార్‌షిప్‌లోని ఒక థ్రస్టర్ పనిచేయకపోవడంతో ముందుగానే ప్రయోగాన్ని ముగించారు. దీంతో స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్‌ను నియంత్రిత పద్ధతిలో పసిఫిక్ మహాసముద్రంలో హవాయి సమీపంలోని నిర్దేశిత ప్రాంతంలో కూల్చివేసింది. గతంలో స్టార్‌షిప్ 13 సబ్ ఆర్బిటల్ పరీక్షా ప్రయోగాలు నిర్వహించినప్పటికీ, వాటిలో ఏదీ భూమి చుట్టూ పూర్తి కక్ష్యను పూర్తి చేయలేదు.

## షాహి మసీదు తొలగింపు..

**- ఉజ్జయినిలో పోలీసులతో ఘర్షణ**



ఉజ్జయిని

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని లో పోలీసులకు, ఓ వర్గానికి మధ్య ఘర్షణ జరిగింది. ఆ నగరంలో ఉన్న షాహి మసీదుకు చెందిన కొంత భాగాన్ని తొలగించాలని భావించారు. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా మసీదులో కొంత నిర్మాణాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టారు. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గం ఆందోళన చేపట్టంది. భారీ స్థాయిలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఓ వర్గానికి చెందిన ప్రజలు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు.మసీదు కాంప్లెక్స్ సమీపంలో భారీ స్థాయిలో పోలీసులు పహారా కాస్తున్నారు. సిటీలో కంతల్ స్క్వేర్ నుంచి గోపాల్ మందిర్ వరకు సుమారు 900 మీటర్ల మేర రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టారు. 2028లో జరిగే సింహస్తా ఈవెంట్ కోసం రోడ్డును సుమారు 15 మీటర్ల వెడల్పుతో విస్తరణ చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు ఆలైన్‌మెంట్‌లో భాగమైన అనేక మతపరమైన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే ఇలాంటి 60 నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు చెప్పారు. కానీ షాహి మసీదుతో పాటు ఖడే హనుమాన్ మందిర్ సమీపంలో ఉన్న మజర్ వల్ల రోడ్డు వెడల్పు కార్యక్రమం నిలిచిపోయింది. షాహి మసీదు శతాబ్దాల నాటి వక్ఫ్ ప్రాపర్టీ అని ఆ వర్గ ప్రజలు వాదిస్తున్నారు. అయితే ఆ మసీదుకు చెందిన ప్రార్థన హాల్, మినార్ ప్రస్తుత విస్తరణలో భాగంగా కూల్చనున్నారు. ఆదివారం నుంచి అక్కడ 2 వేల మంది పోలీసుల్ని మోహరించారు.

## దుబాయ్‌లో నెతన్యాహు రహస్య పర్యటన

**హమాస్‌పై నివేదికను ఖండించాలని యూఏఈ అధ్యక్షుడికి వినతి!**



**జెరూసలెం**

: ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు రహస్యంగా దుబాయ్‌లో పర్యటించారని ఛానెల్ 12టీవీ స్టేషన్ వెల్లడించింది. ఈ పర్యటన గురించి సమాచారం ఉన్న ఇద్దరు వ్యక్తులు సోమవారం దీన్ని ధ్రువీకరించారు. వారు చెబుతున్న దాని ప్రకారం.. ఇజ్రాయెల్ న్యూస్ పేపర్ హారెట్జ్‌లో ఈ నెల ప్రారంభంలో వచ్చిన నివేదిక చుట్టూ ఈ పర్యటన సాగింది.2023 అక్టోబర్7న ఇజ్రాయెల్ మీద హమాస్ దాడులపై నెతన్యాహును యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ముందే హెచ్చరించారని హారెట్జ్ నివేదికలో ఉన్నది. ఈ నివేదిక నిజం కాదని.. దాన్ని ఖండించాలని యూఏఈ అధ్యక్షుడిని కోరేందుకు నెతన్యాహు వెళ్లారని ఆ ఇద్దరు చెబుతున్నారు. ఇప్పటికే నెతన్యాహు కార్యాలయం ఈ నివేదికను ఖండించింది. సెప్టెంబర్ 27 ఆదివారం వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్టు సమాచారం. వీరిద్దరి చర్చలపై స్పందించేందుకు యూఏఈ విదేశాంగ శాఖ నిరాకరించింది.

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న తమిళనాడు సీఎం

**ఎన్నికల హామీ మేరకు బంగారు ఉంగరాల పంపిణీ ప్రారంభం**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన ప్రతి శిశువుకూ గ్రాము బంగారం**

**మధురై రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిలో పథకం ప్రారంభం**

**స్వయంగా చిన్నారులకు బంగారు ఉంగరాలు తొడిగిన సీఎం**

**మాతృత్వానికి గౌరవ సూచికంగా పథకం అమలు**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యం**

**పథకం కోసం రూ.755.83 కోట్లు కేటాయింపు**

**జూన్ 22 నుంచి పుట్టిన చిన్నారులకు పథకం వర్తింపు**




చెన్నై:

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ మరో పథకాన్ని ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి చిన్నారికి ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

**మధురైలో పథకం ప్రారంభం**

మధురైలోని రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన చిన్నారులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగారు. దీంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

**ప్రతి చిన్నారికీ గ్రాము బంగారం**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టే ప్రతి శిశువుకు ఒక గ్రాము బంగారంతో తయారు చేసిన ఉంగరాన్ని అందించనున్నారు. ఈ పథకం జూన్ 22 నుంచి జన్మించిన చిన్నారులకు వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

**మాతృత్వానికి గౌరవ సూచికగా**

మాతృత్వానికి గౌరవం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కూడా ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రూ.755.83 కోట్ల కేటాయింపు**

బంగారు ఉంగరాల పంపిణీ పథకం అమలుకు ప్రభుత్వం రూ.755.83 కోట్లు కేటాయించినట్లు సమాచారం. పథకం కోసం అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**1.28 లక్షల ఉంగరాలు సిద్ధం**

పథకం ప్రారంభం నాటికి సుమారు 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. అర్హులైన చిన్నారులకు దశలవారీగా ఉంగరాలను అందించనున్నారు.

థాయ్‌మామన్ తంగ మొతిరమ్ థిట్టమ్'

తమిళంలో ఈ పథకాన్ని 'థాయ్‌మామన్ తంగ మొతిరమ్ థిట్టమ్'గా పిలుస్తున్నారు. తెలుగులో దీని అర్థం 'మేనమామ ఇచ్చే బంగారు ఉంగరం'గా ఉంటుంది. పథకానికి ఈ పేరు పెట్టడం ద్వారా తల్లి, బిడ్డ మధ్య అనుబంధానికి ప్రతీకగా బంగారు ఉంగరాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## ఎలక్ట్రానిక్స్ ధరలకు రెక్కలు..

**- పండగ వేళ వినియోగదారులకు షాక్**

**-అక్టోబర్ 1 నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరల పెంపు**

**-ఏసీల ధరలు 5--8 శాతం వరకు పెరిగే అవకాశం**

**-టీవీలు, వాషింగ్ మెషీన్లపై 3--4 శాతం భారం**

**-మూడోసారి ధరలు పెంచేందుకు కంపెనీల సన్నాహాలు**

**-ముడిసరుకుల ధరల పెరుగుదలతో తప్పని పెంపు**

**-రవాణా వ్యయాలు, కరెన్సీ హెచ్చుతగ్గులు మరో కారణం**

**-దీపావళి వరకు పాత ధరలకే ఉత్పత్తులు లభించే అవకాశం**

**-పండగ తర్వాత కొత్త ధరల్లు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం**



హైదరాబాద్, ప్రతినిధి

: పండగ సీజన్ ప్రారంభానికి ముందే ఎలక్ట్రానిక్స్ వినియోగదారులకు ధరల పెంపు రూపంలో షాక్ తగలనుంది. ఏసీలు, మొబైల్ ఫోన్లు, ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు అక్టోబర్ 1 నుంచి పెరిగే అవకాశం ఉంది. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను 3 నుంచి 8 శాతం వరకు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాదిలో ధరల పెంపు చేపట్టడం ఇది మూడోసారి కావడం గమనార్హం. అల్యూమినియం, రాగి, ఉక్కు వంటి ముడిసరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా ఖర్చులు అధికమవడం ధరల పెంపునకు ప్రధాన కారణాలుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కరెన్సీ మారకం విలువల్లో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు కూడా కంపెనీల వ్యయాలపై ప్రభావం చూపుతున్నట్లు పేర్కొంటున్నాయి.

**ఏసీలపై అధిక భారం..**

ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. బ్లూస్టార్, గోద్రెజ్, హాయర్, డైకిన్ వంటి సంస్థలు ఇప్పటికే ధరల పెంపును ప్రకటించినట్లు తెలుస్తోంది. ఎల్జీ, వోల్టాస్, హిటాచీ బ్రాండ్ల ఏసీలను విక్రయించే బాష్ హోమ్ కంఫర్ట్ కూడా సుమారు 5 శాతం ధరలను పెంచినట్లు సమాచారం. ముడిసరుకుల ధరలు పెరగడంతో ధరలు పెంచక తప్పడం లేదని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు.

రాగి ధరల ప్రభావం..

గత ఏడాదితో పోలిస్తే రాగి ధర గణనీయంగా పెరిగిందని, దీంతో ఏసీల ధరలను సుమారు 5 శాతం పెంచుతున్నామని హాయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్.ఎస్.సతీష్ పేర్కొన్నారు. టీవీలు, వాషింగ్ మెషీన్ల ధరలు కూడా 3 నుంచి 4 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

**దీపావళి వరకు పాత ధరలే..?**

అయితే ధరల పెంపు వెంటనే వినియోగదారులపై పూర్తిస్థాయిలో ప్రభావం చూపకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. డీలర్ల వద్ద ఇప్పటికే ఉన్న పాత స్టాక్ మరో నెల నుంచి నెలన్నర వరకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో దీపావళి వరకు కొన్ని ఉత్పత్తులు పాత ధరలకే లభించే అవకాశముంది. ఆ తర్వాత కొత్త ధరలు మార్కెట్‌లో పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## నిర్భయ ఘటన రోజులు గుర్తుకొస్తున్నాయ్!

**ఢిల్లీ-ఎన్‌సీఆర్ మైనర్లపై అత్యాచారం ఘటనలపై సుప్రీం సీరియస్**

**న్యూఢిల్లీ**

ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో ఇటీవల మైనర్ బాలికలకు సంబంధించి జరిగిన మూడు లైంగిక దాడి కేసులపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసుల స్పందన కోరింది. గ్రేటర్ నోయిడా-ఢిల్లీ బస్సు, ఆస్థా కుంజ్ పార్క్, స్వరూప్ నగర్‌లో జరిగిన లైంగిక దాడి ఘటనలకు సంబంధించిన కేసులను పరిగణనలోకి తీసుకుంటూ న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనలు 2012 నాటి నిర్భయ కేసు జ్ఞాపకాలను తిరిగి గుర్తు చేస్తున్నాయని, ఆ ఘటన నుంచి ఏవైనా పాఠాలు నేర్చుకున్నామా లేదా అనే ప్రశ్నను



లేవనెత్తుతున్నాయని జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2012లో ఢిల్లీలో నడుస్తున్న బస్సులో నిర్భయ అని వ్యవహరించే 23 ఏండ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె తర్వాత చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది.

# బిజినెస్

## రీఛార్జ్ చేసేవారికి బిగ్ షాక్..

-2 రోజులకు అదనంగా రూ.30
-30 రోజుల రీఛార్జ్ ప్లాన్లపై కేంద్రం ఆదేశాలు
-28 రోజుల ప్లాన్లను 30 రోజులకు మార్చని టెలికం కంపెనీలు
-అదనపు ప్రయోజనాల పేరుతో కొత్త ప్లాన్ల ప్రవేశపెట్టే యోచన
-ఎయిర్‌టెల్‌లో రూ.349 ప్లాన్ ధర రూ.379కు పెంపు
-28 రోజులకు బదులుగా 30 రోజుల వ్యాలిడిటీ
-రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ యథాతథం
-రెండు రోజుల అదనపు వ్యాలిడిటీకి రూ.30 భారం
-కొత్త విధానంతో వినియోగదారులపై అదనపు ఖర్చు



న్యూఢిల్లీ, ప్రతినిధి మొబైల్ రీఛార్జ్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడింది. 30 రోజుల రీఛార్జ్ ప్లాన్లను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం ఆదేశించడంతో టెలికం కంపెనీలు కొత్త ప్లాన్లను ప్రవేశపెడుతున్నాయి. అయితే ఇప్పటికే ఉన్న 28 రోజుల ప్లాన్లను నేరుగా 30 రోజులకు పొడిగించకుండా.. అదనపు ఛార్జీలతో కొత్త ప్లాన్లను అందిస్తున్నాయి.

**రూ.349 ప్లాన్ రూ.379కు..**

ఎయిర్‌టెల్‌లో ఇప్పటివరకు రూ.349తో 28 రోజుల వ్యాలిడిటీ ఉన్న ప్లాన్ అందుబాటులో ఉండేది. ఇందులో రోజుకు 2జీబీ డేటాతో పాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ లభించేవి. తాజాగా ఇదే ప్రయోజనాలతో 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌ను రూ.379కు అందిస్తోంది.

**రెండు రోజులకు రూ.30 అదనం..**

దీంతో వినియోగదారులు అదనంగా రెండు రోజుల వ్యాలిడిటీ కోసం రూ.30 చెల్లించాల్సి వస్తోంది. 28 రోజుల ప్లాన్‌ను నేరుగా 30 రోజులకు మార్చకుండా.. కొత్త ధరతో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకురావడం వల్ల కస్టమర్లపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. కేంద్రం 30 రోజుల ప్లాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించిన నేపథ్యంలో ఇతర టెలికం కంపెనీలు కూడా ఇదే తరహాలో కొత్త ప్లాన్లను తీసుకువస్తాయా అనే అంశం ఆసక్తికరంగా మారింది.

## తగ్గుతున్న బంగారం ధరలు..

**-ఇప్పుడు 10 గ్రాముల గోల్డ్ రేట్ ఎంతంటే..!**



అంతర్జాతీయ మార్కెట్స్ లో బంగారం , వెండి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. చమురు మంటలతో నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలు, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో బంగారం, వెండికి గిరాకీ తగ్గుతోంది. ఇవాళ (సోమవారం) ఉదయం హైదరాబాద్ మార్కెట్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర.. రూ.1,53,300గా ఉంది. అదేవిధంగా కిలో వెండి ధర రూ.2.31 లక్షలకు తగ్గింది. ఇవాళ అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర దాదాపు 2.1 శాతం పతనమై.. ఔన్సు ధర 4,199 డాలర్లకు దిగొచ్చింది. బంగారం ధర ఒక రోజులో ఈ స్థాయిలో తగ్గడం సెప్టెంబర్ 1 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ఇక వెండి కూడా ఔన్సు ధర 62 డాలర్లకు పడిపోయింది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ (అక్టోబరు డెలివరీ) 10 గ్రాముల ధర రూ.1.48 లక్షలుగా ఉంది. సిల్వర్ ఫ్యూచర్ కేజీ ధర రూ.2.28 లక్షల వద్ద కొనసాగుతోంది. హర్మూజ్‌ను తెరిచే శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు తిరస్కరించడంతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. దాంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 106 డాలర్లకు చేరుకుంది. ఇదే తంతు కొనసాగితే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. మరోవైపు ఇటీవల వడ్డీ రేట్లను పెంచిన అమెరికా ఫెడ్.. అక్టోబరులోనూ మరోమారు పెంపు చేపట్టే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు అమెరికా డాలర్ సూచీ కూడా 101.39 కి పెరిగింది. రెండు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపట్లేదని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. ఫలితంగా వీటి ధరలు దిగొస్తున్నాయి.

## గంటలోనే రూ.5 లక్షల కోట్లు ఆవిరి..

**-మార్కెట్ కుప్పకూలడానికి 5 ప్రధాన కారణాలివే!**



దేశీయ స్టాక్ మార్కెట్‌లో సోమవారం భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొంది. మార్కెట్ ప్రారంభమైన గంటలోనే సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ50 కీలకమైన 23 వేల మార్క్ దిగువకు జారుకుంది. ఈ పతనంతో కేవలం గంట వ్యవధిలోనే దాదాపు రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ ఆవిరైంది. మార్కెట్ ప్రారంభ సమయానికి బీఎస్ఈలో సెన్సెక్స్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.4,82,16,004 కోట్లుగా ఉంది. ఉదయం 10.15 గంటల సమయానికి అది రూ.4,77,19,611 కోట్లకు తగ్గింది. దీంతో సుమారు రూ.4.9 లక్షల కోట్ల సంపద ఆవిరైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా ఏడో వారాన్ని నష్టాలతో ముగించాయి. దీనికి తోడు అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగుదల, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి.

# స్పోర్ట్స్

## పోర్చుగల్‌కు నా అవసరం లేదా?.. అయితే వీడ్కోలు పలుకుతా..!



అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో లియోనల్ మెస్సీ వీడ్కోలుతో ఇప్పుడు అందరి కళ్లు క్రిస్టియానో రొనాల్డో మీదే ఉన్నాయి. కోట్లాది మంది అభిమానగణమున్న ఈ ఫార్వార్డ్ ప్లేయర్ మరికొన్ని రోజులు ఆటత అలరిస్తాడనుకుంటే వీడ్కోలు పలికేలా ఉన్నాడు. ఈమధ్య భావోద్వేగానికి లోనైన రొనాల్డో స్వయంగా తన రిటైర్మెంట్ టైం వచ్చేసిందిని అన్నాడు. సొంతదేశం తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అతడు.. తనను బెంచ్ మీద కూర్చోబెట్టడంపై విచారం వ్యక్తం చేశాడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇలాగైతే తాను కూడా మెస్సీని అనుసరిస్తూ వీడ్కోలు పలుకుతానేమో అని పేర్కొన్నాడీ వెటరన్. సాకర్ ప్రపంచంలో తన ఆటతో కోట్లాదిమందిని మంత్రముగ్దులను చేసిన క్రిస్టియానో రొనాల్డో కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. వరల్డ్‌కప్ అనంతరం నెయ్‌మర్, లియోనల్ మెస్సీలు వీడ్కోలు పలకగా.. తదుపరి వికెట్ రొనాల్డోనే అనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అతడే స్వయంతో వీడ్కోలుపై స్పందించాడు. నార్వేతో మ్యాచ్‌లో బెంచ్ మీద కూర్చోబెట్టడంపై చిన్నబుచ్చుకున్న రొనాల్డో ఇక రిటైర్మెంట్ సమయం వచ్చేసిందని అభిప్రాయపడ్డాడు. 'పోర్చుగల్ మ్యాచ్‌లో బెంచ్‌పై కూర్చోబెట్టడం నన్ను చాలా బాధిస్తోంది. జట్టుకోసం సర్వం ధారపోసిన నేను.. మేనేజ్‌మెంట్‌కు నాపై నమ్మకం లేని రోజు వస్తుందని అస్సలు ఊహించలేదు. ఇంతకుముందులా వారు నన్ను చూడడం లేదు. అయితే.. దేశం తరఫున నేను కలగన్న ప్రతిదీ సాధించాను. పోర్చుగల్ జట్టుకు నా అవసరం లేనప్పుడు.. నా అంతర్జాతీయ కెరీర్ ముగింపు దశకు వచ్చేసిందని నేను అంగీకరిస్తున్నా. ఇలా బెంచ్ మీద ఉండడం కంటే వీడ్కోలు పలకడమే సరైన నిర్ణయం అనిపిస్తోంది' అని రొనాల్డో ఉద్వేగభరింతగా వెల్లడించాడు. నార్వేతో మ్యాచ్‌లో రొనాల్డో 90 నిమిషాలు బెంచ్ మీదే ఉన్నాడు. అవకాశం ఇస్తారేమోనని ఎదురుచూసి విసిగెత్తిపోయిన అతడు.. కోపంగా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాడు. అయితే.. ఈ మ్యాచ్‌లో హెలాండ్ 57వ నిమిషంలో గోల్ చేసినా 1-2తో పోర్చుగల్ గెలుపొందింది.

## మహిళల ప్రీమియర్ లీగ్ రిటెన్షన్ జాబితా వచ్చేసింది..!



మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి సమయం దగ్గరపడుతోంది. దాంతో, ఆనవాయితీ ప్రకారం ప్రధాన క్రికెటర్లను అట్టిపెట్టుకున్నాయి ఐదు ఫ్రాంచైజీలు. నిలకడగా రాణిస్తున్న కీలక ప్లేయర్లను రిటైన్ చేసుకొని.. అవసరం లేదనుకున్న వాళ్లను విడుదల చేశాయి. ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు సోమవారం తమ రిటెన్షన్ జాబితా ప్రకటించాయి. ఊహించినట్టే స్టార్ ప్లేయర్లు తమ స్థానం పదిలం చేసుకోగా.. పేలవ ప్రదర్శన చేసిన కొందరిని వద్దు పొమ్మని వదిలేశాయి. డబ్ల్యూపీఎల్ ఐదో సీజన్ రిటెన్షన్ జాబితా వచ్చేసింది. వేలానికి సమయం ముంచుకొస్తున్న వేళ ఐదు ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకున్న క్రికెటర్ల పేర్లను వెల్లడించాయి. అక్టోబర్ 28న కొచ్చిలో వేలం జరుగనున్నందున.. గడువులోపే రిటైన్ జాబితాను ప్రకటించాయి. ఊహించినట్టుగానే భారత జట్టులోని ప్రధాన ప్లేయర్లు, విదేశీ స్టార్లకు చోటు దక్కింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన సహా 12 మందిని రిటైన్ చేసుకుంది. మాజీ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ మాత్రం.. ఆరుగురు భారత క్రికెటర్లను, ఐదుగురి విదేశీయులను మాత్రమే అట్టిపెట్టుకుంది. వరసగా రెండు ఫైనల్స్‌లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ రిటెన్షన్ విషయంలో ఆచితూచి వ్యవహరించింది. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్, షఫాలి వర్మ, శ్రీ చరణి, నందిని శర్మ సహా.. మరో మంది భారత స్టార్లు, నలుగురు విదేశీ స్టార్లను అట్టిపెట్టుకుంది. యూపీ వారియర్స్ ఫ్రాంచైజీ 11 మందిని రిటైన్ చేసుకోగా.. గుజరాత్ జెయింట్స్ అత్యధికంగా 14 మందిని కొనసాగించింది. వచ్చే ఏడాది జనవరి 14న డబ్ల్యూపీఎల్ ఐదో సీజన్ మొదలవ్వనుంది.

ముంబై ఇండియన్స్ : హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), అమన్‌జోత్ కౌర్, రహిలా ఫిరదౌస్, సజీవన సంజన, వైష్ణవి శర్మ, సంస్కృతి గుప్తా.
విదేశీ ప్లేయర్లు -- షబ్నం ఇస్మాయిల్, అమేలియా కేర్, నాట్ సీవర్ బ్రంట్, నికోల కారీ, హేలీ మాథ్యూస్,

గుజరాత్ జెయింట్స్ : అనుష్క శర్మ, భారతి ఫుల్‌మాలి, కనికా ఆహుజా, తనూజ కన్వర్, రాజేశ్వరి గైక్వాడ్, హ్యాపీ కుమారి, కష్వీ గౌతమ్, రేణుకా సింగ్, యస్తికా భాటియా.
విదేశీ ప్లేయర్లు -- బేత్ మూనీ, జార్జియా వరేహం, అష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, సోఫీ డెవినె,

యూపీ వారియర్స్: దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్, సిమ్రన్ షేక్, శిఖా పాండే, షిప్రా గిరి,
విదేశీ ప్లేయర్లు -- మేగ్ లానింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్, సోఫీ ఎకిల్‌స్టోన్, తారా నోరిస్.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన(కెప్టెన్), రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, సయాలి సత్ఘరే, ప్రేమా రావత్, రీచా ఘోష్, ప్రత్యూష కుమార్ అరుంధతి రెడ్డి.
విదేశీ ప్లేయర్లు -- లారెన్ బెల్, ఎలీసా పెర్రీ, నడినే డీక్లెర్క్, జార్జియా వరేహం,

ఢిల్లీ క్యాపిటల్స్: జోమీమా రోడ్రిగ్స్(కెప్టెన్), షఫాలి వర్మ, శ్రీ చరణి, మమతా మదివల, నందిని శర్మ, నిక్కీ ప్రసాద్, దీయ యాదవ్, మిన్ను మని.
విదేశీ ప్లేయర్లు -- అనాబెల్ సథర్‌లాండ్, లారా వొల్వార్డ్, చినెల్లె హెన్రీ, మరిజానే కాప్

## మళ్లీ పసిడి దక్కలే..

**-5 వేల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్‌కు కాంస్యమే..!**



: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి పతకానికి దూరమవుతున్నారు. మెరుగైన ప్రదర్శన చేస్తున్నా సరే వెండితో లేదా కాంస్యంతోనో సరిపెట్టుకుంటున్నారు. నగోయలో సీనియర్ స్ప్రింటర్ పారుల్ చౌదరీ పతక వేట కొనసాగుతోంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో కాంస్యం సాధించిన తను.. రోజు వ్యవధిలోనే దేశానికి మరో పతకం అందించింది. సోమవారం మహిళల 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్ ఫైనల్లో సత్తా చాటిన పారుల్ మూడో స్థానంలో నిలిచింది. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో పారుల్ చౌదరీ మరో పతకం కొల్లగొట్టింది. ఇప్పటికే మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో కాంస్యంతో మెరిసిన ఈ వెటరన్ ఈసారి 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లోనూ తళుక్కుమంది. సోమవారం జరిగిన ఫైనల్లో మూడో స్థానంతో కాంస్యంను ఒడిసిపట్టింది తను. పసిడి పోరులో ఆమె 15:14.61 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కంటే 10 సెకన్లు ఆలస్యంగా పరుగెత్తింది పారుల్. గత ఎడిషన్ ఆసియాడ్‌లో స్వర్ణ పతకం పట్టేసిన పారుల్ ఈసారి కంచుమోతతోనే సరిపెట్టుకుంది. ఈ విభాగంలో కెన్యా అథ్లెట్ విన్‌ఫ్రెడ్ యవి ప్రథమ స్థానంలో నిలిచి పసిడిని ఎగరేసుకుపోయింది.

# వామ్మో.. ఆ హీరోతో యాక్టింగ్ అంటే భయం..



తెలుగు సినీ పరిశ్రమలో హీరోయిన్ సదా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సుదీర్ఘ సినీ ప్రయాణం, నటన పట్ల తన విలక్షణమైన దృక్పథం, వ్యక్తిగత జీవిత సూత్రాలపై ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆమె తన కెరీర్‌లో ఎదురైన అనుభవాలను, సహనటులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు.తన మొదటి చిత్రం జయం గురించి ప్రస్తావిస్తూ, అది నితిన్, తన జీవితంలో ఒక మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. దర్శకుడు తేజ క్రమశిక్షణను ఆమె గుర్తు చేసుకున్నారు. సెట్స్‌లో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, కెమెరా ముందు నటులు ప్రొఫెషనల్‌గా ఉండాలని తేజ పట్టుబడేవారని సదా తెలిపారు. జయం షూటింగ్ అనుభవం తనను ఒక నటిగా తీర్చిదిద్దిందని, అది ఒక మోల్డింగ్ ఎక్స్‌పీరియన్స్ అని పేర్కొన్నారు. ఆ సినిమా లేకపోతే తన పని పట్ల తాను అంత క్యాజువల్‌గా ఉండేదానినని చెప్పారు.ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌తో పని చేసిన అనుభవాలను వివరిస్తూ, విక్రమ్‌తో అపరిచితుడు (అన్నియన్) సినిమా సమయంలో తనకు కొంత భయం ఉండేదని సదా అంగీకరించారు. విక్రమ్ గొప్ప నటుడని, ఆయన స్థాయికి తగ్గ నటనను ప్రదర్శించాలనే ఒత్తిడి ఉండేదని ఆమె తెలిపారు. దర్శకుడు శంకర్ మార్గదర్శకత్వం వల్ల తాను బాగా నటించగలిగానని పేర్కొన్నారు.జూనియర్ ఎన్టీఆర్‌తో నాగా సినిమాలో డాన్స్ చేయడం గురించి మాట్లాడుతూ, ఆయన అద్భుతమైన డాన్సర్ అని, ఒక్కసారి చూసి వెంటనే నేర్చుకునే సామర్థ్యం ఆయనకు ఉందని కొనియాడారు. అప్పట్లో తనకు తెలుగు రాకపోవడం, రిహార్సల్స్‌కు ఎక్కువ సమయం పట్టడం వంటి సవాళ్లు ఎదురయ్యేవని, కానీ ఎన్టీఆర్ వెంటనే టేక్స్ ఇచ్చేవారని చెప్పారు. ఆయన పని పట్ల ఎంత అంకితభావం, అభిరుచి ఉన్న వ్యక్తి అని సదా అన్నారు.తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, గత 20 సంవత్సరాల ప్రయాణంలో ఎలాంటి గాసిప్‌లు, వివాదాలకు తాను దూరంగా ఉన్నానని సదా తెలిపారు. జీవితంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమే ముఖ్యమని, గతం నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలని ఆమె అన్నారు. భవిష్యత్తు గురించి ఊహించుకోవడం కంటే వర్తమానంలో ఆనందంగా ఉండడానికే ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. తన వృత్తితో పాటు కేఫ్ నడపడం, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ వంటివి తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయని సదా పేర్కొన్నారు.



# మండాడి రికార్డ్ మైల్ స్టోన్..

## -స్టార్ హీరోకు ధీటుగా దూసుకెళ్తున్న సూరి




టాలీవుడ్ యాక్టర్ సుహాస్, తమిళ నటుడు సూరి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం మండాడి . సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ మూవీని సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేశాడు. రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన మండాడి సూరి కెరీర్‌లో గ్లోబల్‌వైడ్‌గా రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన తొలి సినిమాగా నిలిచింది. మండాడి తెలుగు వెర్షన్ కూడా కమర్షియల్ సక్సెస్ అందుకుంది.సూరి సొంత రాష్ట్రం తమిళనాడులో బాక్సాఫీస్ వద్ద రూ.80 కోట్లు వసూలుచేసిన ఈ మూవీ రూ.100 కోట్ల మైల్ స్టోన్ దిశగా ముందుకెళ్తోంది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలే ఈ మార్క్‌ను చేరుకుంటాయి. ఒకవేళ మూడంకెల డిజిట్‌ను దాటుకుందంటే సూరి కెరీర్‌లో ఇదొక హిస్టారికల్ అఛీవ్‌మెంట్‌గా నిలిచిపోనుంది. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో నటించాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా.. ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కించింది. మరి రాబోయే రోజుల్లో మండాడి బాక్సాఫీస్ వసూళ్లు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.



# ఓటీటీలోకి కార్తీ 'సర్దార్ 2'..

## - మూడు వారాల్లోనే డిజిటల్ ఎంట్రీ!



తమిళ హీరో కార్తీ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా.. కార్తీ కెరీర్‌లో విజయవంతమైన చిత్రాల్లో ఒకటైన 'సర్దార్'కు కొనసాగింపుగా రూపొందింది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ సీక్వెల్ మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మిశ్రమ స్పందనే లభించింది. ఇప్పుడు థియేట్రికల్ రన్ ముగించుకుని డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'సర్దార్ 2' అక్టోబర్ 1 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ముఖ్యంగా ఈ సినిమా థియేటర్లలో సెప్టెంబర్ 10న విడుదల కాగా.. కేవలం మూడు వారాల్లోనే ఓటీటీలోకి వస్తుండటం గమనార్హం.అంతేకాదు.. ఓటీటీ విడుదలను కేవలం తమిళానికి మాత్రమే పరిమితం చేయకుండా పలు భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించవచ్చు. థియేటర్లలో మిస్ అయిన వారికి, మరోసారి సినిమాను చూడాలనుకునే కార్తీ అభిమానులకు ఇది మంచి అవకాశం కానుంది. 'సర్దార్ 2'లో కార్తీ మరోసారి విభిన్నమైన పాత్రల్లో కనిపించారు. ఈ సినిమాలో ఆయన తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో ఒక వైపు కనిపిస్తే.. మరోవైపు ఇన్‌స్పెక్టర్ విజయ్ ప్రకాష్‌గా నటించారు. ఈ రెండు పాత్రల మధ్య ఉండే వ్యత్యాసం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ కథానాయికలుగా నటించగా.. ఎస్.జే. సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. స్పై యాక్షన్ అంశాలతో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలతో సినిమాను తెరకెక్కించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఎస్. లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని నిర్మించారు. సామ్ సీఎస్ సంగీతం అందించగా.. జార్జ్ సి. విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేశారు. తెలుగులో ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేసింది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఫలితం అందుకోలేకపోయిన 'సర్దార్ 2'.. ఓటీటీలో మాత్రం ఎలాంటి స్పందనను అందుకుంటుందో చూడాలి. ముఖ్యంగా బహుభాషల్లో స్ట్రీమింగ్ కావడంతో డిజిటల్ ప్రేక్షకుల్లో సినిమాపై మరోసారి ఆసక్తి ఏర్పడే అవకాశం ఉంది.

# 13ఏళ్లుగా అతనితో రిలేషన్‌లో ఉన్నా..

## -అందుకే బయటపెట్టలేదు: తాప్సీ పన్ను

సినీ తారల వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అభిమానుల్లో ఎప్పుడూ ఉంటుంది. అయితే కొందరు మాత్రం కెమెరాల ముందు ఎంత యాక్టివ్‌గా ఉన్నా.. తమ పర్సనల్ లైఫ్‌ను మాత్రం చాలా ప్రైవేట్‌గా ఉంచుతారు. అలాంటి వారిలో బాలీవుడ్ నటి తాప్సీ పన్ను కూడా ఒకరు. తన సినిమాలు, కెరీర్‌కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకునే ఈ ముద్దుగుమ్మ.. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాల్లో మాత్రం బయటపెట్టదు. తాప్సీ పన్ను.. మాజీ డెన్మార్క్ ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్, కోచ్ మథియాస్ బోయ్ తో చాలాకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరి బంధం దాదాపు 13 ఏళ్లుగా కొనసాగుతోంది. 2024లో వీరి వివాహం జరిగినప్పటికీ, పెళ్లికి సంబంధించిన విషయాలను తాప్సీ పెద్దగా బయటకు తీసుకురాలేదు. సోషల్ మీడియాలోనూ తన వ్యక్తిగత జీవితాన్ని చాలా తక్కువగా చూపిస్తుంటుంది ఈ అమ్మడు. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో తాప్సీ తన రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది.తన వివాహ బంధానికి పునాది ఏంటో చెబుతూ.. పరస్పర గౌరవమే తమ బంధానికి ప్రధాన కారణమని స్పష్టం చేసింది. తాను బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సమయంలోనే మథియాస్‌తో తన రిలేషన్‌షిప్ ప్రారంభమైందని తాప్సీ తెలిపింది. ఇన్నేళ్లుగా కలిసి ప్రయాణించిన తమ బంధంపై తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పింది. జీవితంలో తీసుకున్న నిర్ణయాల్లో మథియాస్‌ను ఎంచుకోవడం అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని ఈ అమ్మడు పేర్కొంది.తన కుటుంబం తనకు జీవితంలో లభించిన వరమైతే.. కెరీర్ అనుకోకుండా వచ్చిన అవకాశం అని, కానీ జీవిత భాగస్వామిని మాత్రం తానే ఎంచుకున్నానని తాప్సీ చెప్పింది. అందుకే ఈ నిర్ణయంపై తనకు ఎంతో గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. మథియాస్‌తో తమ అనుబంధం గురించి మాట్లాడిన తాప్సీ.. ఇన్నేళ్లుగా తమ మధ్య ఎంతో భద్రత, నమ్మకం ఏర్పడిందని తెలిపింది. అయితే వీటన్నింటికంటే ముఖ్యంగా ఒకరిపై మరొకరికి ఉన్న గౌరవమే తమ బంధాన్ని బలంగా నిలబెట్టిందని చెప్పింది.అలాగే సినీ పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు తమ జీవితంలో ప్రేమను వెతుక్కుంటున్నారని తాప్సీ పేర్కొంది. అయితే అదే సమయంలో సంబంధాలను ఎక్కువకాలం కొనసాగించడం ప్రస్తుతం మరింత కష్టంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. తాత్కాలిక ఆనందాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామా.? అనే ప్రశ్నను కూడా ఆమె ప్రస్తావించింది. తన వ్యక్తిగత అనుభవం మాత్రం దీనికి భిన్నంగా ఉందని తెలిపింది. తమ బంధం ఇన్నేళ్లుగా కొనసాగడానికి పరస్పర గౌరవం, అవగాహన, నమ్మకమే కారణమని తాప్సీ చెప్పుకొచ్చింది.